నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

నమ్మలేని నిజాలు

చెడిన ధర్మం
బ్యాటుబంతి మిథునం
పేరు మారాలి

తీవ్ర వాదులు
చంపి చచ్చిరి నేడు
ధర్మం గెల్చింది

దృఢ సంకల్పం
కోరికల పడవ
సుఖాల తీరం

రణ కిరణం
ప్రజా తూర్పుకిరణం
మోదుగ పువ్వు

తిరుగు బాటు
ప్రభుత్వ చావుతూట
వీరుడి బాట

- రేడియమ్
సెల్: 9291527757



# నేటి నిజం
తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

శ్రీనిజాలు

హైద్రాబాద్ నిండ మెరిసె
అందాల రాశులు !
దారినిండ ఎండి తడిసె
ధాన్యాల రాశులు !
భానుడి తెగభగభగలకు
సుందరీ భామలు !
కమిలి కుమిలిపోతున్నరు
సింధూర పూవులు !

- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245



హైదరాబాద్ గురువారం 15-5-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001. సంపుటి :31 సంచిక:220 పేజీలు:6 వెల: రూ.1/-

## రాష్ట్రపతితో సీడీఎస్, త్రివిధ దళాధిపతుల సమావేశం



న్యూఢిల్లీ, మే 14:భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) అనిల్ చౌహాన్ సహా త్రివిధ దళాధిపతులు భేటీ అయ్యారు. ఇటీవల పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిస్పందనగా భారత్ బలగాలు చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' విజయవంతంగా ముగిసిన విషయం తెలిసిందే.

ఈ ఆపరేషన్‌కు సంబంధించిన సమగ్ర వివరాలను సైనిక ఉన్నతాధికారులు రాష్ట్రపతికి సమర్పించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా త్రివిధ దళాలు ప్రదర్శించిన ధైర్యసాహసాలు, కట్టుదిట్టమైన చర్యలను ఈ సందర్భంగా రాష్ట్రపతి ముర్ము ప్రశంసించారు.

### ఈ భేటీపై రాష్ట్రపతి భవన్ ట్వీట్

"రక్షణ దళాల అధిపతి జనరల్ అనిల్ చౌహాన్, సైన్యాధ్యక్షుడు జనరల్ ఉపేంద్ర ద్వివేది, వైమానిక దళాల అధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్, నావికా దళాల అధిపతి అడ్మిరల్ దినేశ్ కె. త్రిపాఠి రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి ఆపరేషన్ సిందూర్ గురించి వివరించారు. ఉగ్రవాదంపై భారతదేశం యొక్క ప్రతిస్పందనను అద్భుతమైన విజయంగా మార్చిన సాయుధ దళాల శౌర్యం, అంకితభావాన్ని రాష్ట్రపతి ప్రశంసించారు" అని రాష్ట్రపతి భవన్ తన

## సీజేఐగా ప్రమాణ స్వీకారం చేసిన జస్టిస్ బీఆర్ గవాయి

న్యూఢిల్లీ, మే 14:జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయి ఇవాళ 52వ భారత ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయన చేత ఇవాళ ప్రమాణ స్వీకారం చేయించారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో ప్రధాని మోదీ, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్, మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ పాల్గొన్నారు. సీజేఐగా బాధ్యతలు స్వీకరించిన తొలి బుద్ధిస్టు, రెండో దళిత వ్యక్తిగా ఆయన రికార్డుకెక్కారు.

మహారాష్ట్రలోని అమరావతిలో 1960, నవంబర్ 24వ తేదీన ఆయన జన్మించారు. అంబేద్కర్ నవాత్రాలను అవలంబించిన కుటుంబంలో ఆయన జన్మించారు. జస్టిస్ బీఆర్ గవాయి తండ్రి ఆర్ ఎస్ గవాయి. ఆయన రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియాలో ప్రముఖ నేత. బీహార్, సిక్కిం, కేరళ రాష్ట్రాలకు గవర్నర్‌గా చేశారు.

మంగళవారం సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా పదవీ విరమణ చేశారు. 2019 మే 24న సుప్రీంకోర్టుకు పదోన్నతిపై వచ్చిన జస్టిస్ గవాయ్ సీజేఐగా ఆరు నెలల కు పైగా కొనసాగనున్నారు. 2025 నవంబర్ 23న సీజేఐగా ఆయన పదవీ విరమణ చేస్తారు.

జస్టిస్ కేజీ బాలకృష్ణన్ తర్వాత సీజేఐ గా బాధ్యతలు చేపట్టనున్న రెండో దళిత న్యాయ మూర్తి జస్టిస్ గవాయ్ కావడం విశేషం.

## ఉద్రిక్తతలు తగ్గేందుకు భారత్-పాక్ దేశాలు డిన్నర్ చేసుకోవాలి : డొనాల్డ్ ట్రంప్

న్యూఢిల్లీ, మే 14: భారత్–పాకిస్థాన్ దేశాల మధ్య కాల్పుల విరమణకు తానే కారణమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి వ్యాఖ్యానించారు. ఉద్రిక్తతలు తగ్గించుకోవడానికి రెండు దేశాలు కలిసి మంచి డిన్నర్ ఏర్పాటు చేసుకోవాలని సలహా కూడా ఇచ్చారు. అణు క్షిపణుల తో యుద్ధాలు వద్దని చెప్పారు. సౌదీ అరేబియాలో యూఎస్–సౌదీ ఇన్వెస్ట్‌మెంట్ ఫోరమ్‌లో ట్రంప్ మాటాడారు. ఈ సందర్భంగా ట్రంప్ తనను తాను శాంతికర్తగా అభివర్ణించుకున్నారు. అణ్వాయుధ దేశాలైన భారత్–పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలను తగ్గించడానికి ప్రయత్నించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి సౌదీ యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్, టెస్లా సీఈవో ఎలాన్ మస్క్, అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో తదితరులు హాజరయ్యారు. భారత్– పాకిస్థాన్ మధ్య అణుయుద్ధాన్ని నివారించడానికి తన మధ్యవర్తిత్వం సాయపడిందని ట్రంప్ తెలిపారు. అది లక్షలాది ప్రాణాలను కాపాడిందని అన్నారు.

ఉద్రిక్తతలు మరింత తగ్గేందుకు భారత్, పాకిస్థాన్ దేశాలు మంచి డిన్నర్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. 'ఇరుదేశాల మధ్య శాంతి ప్రక్రియలో ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ శాఖ మంత్రి మార్కో రూబియోలు పాలుపంచుకున్నారు. ఇరు దేశాల పరిస్థితి బాగుందని అనుకుంటున్నా. వాళ్లని మనం ఒకచోట చేర్చవచ్చు. మార్కో రూబియో, వాళ్లు కలిసి బయటకు వెళ్లి మంచి విందు చేసుకోవచ్చు. ఇది బాగుంటుంది కదా?' అని ట్రంప్ ఫోరమ్‌లో వ్యాఖ్యానించారు.

'కొన్ని రోజుల క్రితమే భారత్–పాకిస్థాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలను తగ్గించడానికి చరిత్రక కాల్పుల విరమణ ఒప్పందాన్ని అమలుచేయడంలో మా యంత్రాంగం విజయవంతమైంది. ఈ విషయంలో నేను వాణిజ్య అంశాలను ఎక్కువగా ఉపయోగించాను. సహచరులారా రండి. ఒక ఒప్పందాన్ని కుదుర్చుకుందాం. వ్యాపారం చేద్దాం. అణు క్షిపణుల వాణిజ్యం చేయొద్దు. అందరికీ ఆనందం కలిగేలా చేద్దాం. భారత్–పాక్ పాలకులు శక్తిమంతమైన, ఉత్తమ, తెలివైన నేతలు. యుద్ధం నిలిచిపోయింది.

ఇది అలాగే కొనసాగాలని ఆశిద్దాం' అని ట్రంప్ అన్నారు. ఈ సందర్భంగా ఆహూతుల చప్పట్లతో ట్రంప్‌ను అభినందించారు. అయితే కాల్పుల విరమణ విషయంలో మూడోపక్షం మధ్యవర్తిత్వాన్ని భారత్ తిరస్కరిస్తోంది. భారత్, పాకిస్థాన్‌లకు చెందిన డైరెక్టర్ జనరల్స్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంవోలు) తమంతట తాము అవగాహనకు వచ్చారని, ఈ వ్యవహారంలో మరెవరి ప్రమేయం లేదని భారత ప్రభుత్వ వర్గాలు స్పష్టంచేశాయి. ఈ నేపథ్యంలో రెండు దేశాల మధ్య కాల్పుల విరమణకు తానే మధ్యవర్తిత్వం వహించానని ట్రంప్ మళ్లీ మళ్లీ చెప్పుకుంటుండటం గమనార్హం.

## బాధ్యతలు స్వీకరించిన రాష్ట్ర సమాచార కమిషనర్లు



హైదరాబాద్, మే 14:రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్లుగా సీనియర్ జర్నలిస్టులు పీవీ శ్రీనివాస్, అయోధ్య రెడ్డి, న్యాయవాదులు దేశాల భూపాల్, మోహిసినా పర్వీన్ ప్రమాణ స్వీకారం చేశారు. బుధవారం హైదరాబాద్ లో జరిగిన కార్యక్రమంలో వారితో రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ జి.చంద్రశేఖర్ రెడ్డి ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి, సీఎస్ కె. రామకృష్ణరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన ఆర్టీఐ కమిషనర్లకు సీఎం శుభాకాంక్షలు తెలిపారు. వీరు పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి మూడేళ్ల పాటు లేదా వయసు 65 ఏళ్లు నిండే వరకు వారు రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్లుగా కొనసాగుతారు.

## అప్పులకు వడ్డీలు చెల్లిస్తున్నాం : డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, మే 14:రాష్ట్రంలో ఆశించిన స్థాయిలో ఆదాయం లేకపోయినా.. అప్పులకు మాత్రం క్రమం తప్పకుండా వడ్డీలు చెల్లిస్తూనే ఉన్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం మధిర నియోజకవర్గం ఎర్రుపాలెంలో మీడియాతో ఆయన మాట్లాడారు. గత పదేళ్ల పాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుపేదలకు ఇండ్లు ఇస్తామని మభ్య పెట్టిందని ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇండ్లు లేని వారికి ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తున్నామన్నారు. ధనిక రాష్ట్రాన్ని బీఆర్ఎస్ చేతిలో పేడితే.. రూ. 7లక్షల కోట్ల అప్పులు చేసి వెళ్లిపోయిందని ఆరోపించారు. ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టినా.. రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ పథకాలను సమర్ధవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. 90లక్షల కుటుంబాలకు సన్న బియ్యం అందజేస్తున్నామన్నారు.

**నిరుద్యోగులకు ఉపాధి..**

నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా రూ. 9వేల కోట్లతో రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రారంభించామని మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. జూన్ 2న లబ్ధిదారులకు ఆర్థిక సాయానికి సంబంధించి ధ్రువీకరణ పత్రాలను అందజేస్తామన్నారు. రాజీవ్ యువ వికాసం స్కీమ్‌కు సంబంధించి సోషల్ మీడియాలో సిబిల్ స్కోర్ పేరుతో అసత్య ప్రచారం జరుగుతోందని ఆయన మండిపడ్డారు. ఫేక్ ప్రచారాలను ఎవరూ నమ్మొద్దని యువతకు విజ్ఞప్తి చేశారు.

**నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు..**

రాష్ట్ర వ్యాప్తంగా నిరుపేదలకు ఇదిరమ్మ ఇండ్లు నిర్మించి ఇచ్చేందుకు ప్రభుత్వం రూ. 22,500 కోట్లు ఖర్చు చేస్తుందని భట్టి తెలిపారు. ఇళ్లు లేని వాళ్లు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నిజమైన లబ్ధిదారులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. ఇక వ్యవసాయం, ఉచిత విద్యుత్ కోసం ప్రభుత్వం ఏటా రూ. 12,500 కోట్లు ఖర్చు చేస్తోందని పేర్కొన్నారు. ఈనెల 18న నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేటలో సీఎం రేవంత్ రెడ్డి పథకాన్ని ప్రారంభించబోతున్నారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు.

## గాజాపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు.. 48 మంది మృతి



న్యూఢిల్లీ, మే 14: గాజాపై ఇజ్రాయెల్ భీకర దాడులకు పాల్పడింది. మంగళవారం రాత్రి వైమానిక దాడులు చేసింది. ఈ దాడుల్లో దాదాపు 50 మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు.

మంగళవారం రాత్రి, బుధవారం తెల్లవారుజామున ఉత్తర గాజాలోని ఇళ్లపై ఇజ్రాయెల్ ఫోర్స్ వైమానిక దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో కనీసం 48 మంది మరణించినట్లు జబాలియాలోని ఇండోనేషియా ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. మృతుల్లో 22 మంది చిన్నారులు కూడా ఉన్నట్లు తెలిపాయి. మరోవైపు గాజాలో యుద్ధాని ఆపడానికి ఎలాంటి మార్గం లేదని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సౌదీ పర్యటన వేళ ఈ దాడులు జరగడం గమనార్హం.

## 3706 కోట్లతో సెమీకండక్టర్ యూనిట్.. ఆమోదించిన కేంద్ర క్యాబినెట్

న్యూఢిల్లీ, మే 14: దేశంలో మరో సెమీకండక్టర్ల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. బుధవారం కేంద్ర క్యాబినెట్ ఆ యూనిట్ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ఉత్తరప్రదేశ్‌లోని జేవర్‌లో సుమారు 3706 కోట్ల ఖర్చుతో ఆ సెమీకండక్టర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నారు.

హెచ్‌సీఎల్–ఫాక్స్‌కాన్ కంపెనీ.. సెమీకండక్టర్ ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించనున్నది.

మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఆటోమొబైల్స్, ఇతర డివైస్‌లకు కావాల్సిన డిస్‌ప్లే డ్రైవర్ చిప్స్‌ను అక్కడ తయారు చేయనున్నట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. కేంద్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాలను ఆయన మీడియాకు వెల్లడించారు. నెలకు సుమారు 20 వేల వాఫర్లను ప్రాసెస్ చేయనున్నారు. ఈ కంపెనీ ద్వారా సుమారు రెండు వేల ఉద్యోగాలు కల్పించనున్నారు.

దేశంలో ఇప్పటికే అయిదు సెమీకండక్టర్ యూనిట్లు నిర్మాణంలో ఉన్నాయి. ప్రస్తుతం ఆరో కంపెనీకి శ్రీకారం చుట్టున్నారు. హెచ్‌సీఎల్, ఫాక్స్‌కాన్ కంపెనీలు సంయుక్తంగా సెమీకండక్టర్ల ఉత్పత్తి చేయనున్నాయి. హార్డ్‌వేర్ ఉత్పత్తి, అభివృద్ధిలో హెచ్‌సీఎల్‌కు సుదీర్ఘ చరిత్ర ఉంది. ఇక ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తిలో ఫాక్స్‌కాన్ కూడా ప్రపంచ మేటి సంస్థే. యమునా ఎక్స్‌ప్రెస్‌వే ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ అథారిటీ సమీపంలో ఉన్న జీవార్ విమానాశ్రయం వద్ద కొత్త కంపెనీ ఏర్పాటు చేయనున్నారు.

## అమ్మే విశ్వ విజేత



-డా॥ కత్తి పద్మారావు
9849741695

ఆకాశాన నక్షత్రాలు కడలి అంతరంగాన
అద్దం చూసుకుంటున్నాయి
ఆ జలపాతాల సవ్వడికి పక్షుల
కుహూరావాలు జత కలుస్తున్నాయి
దావాగ్నికి కూడా ఆ నల్ల మబ్బుల నుండి
కురుస్తున్న చిరుజల్లులు చల్లబరుస్తున్నాయి
నిజమే! అమ్మ ఒక విశ్వం
అమ్మ ఒక జీవన ప్రభాతం
ప్రపంచ పరిణామానికి అమ్మ మూల సూత్రం
అమ్మలో వెన్నెల
అమ్మలో వెలుగు
అమ్మ ఒక పాఠశాల
అమ్మ నిరంతరం ఉపాధ్యాయిని
మానవత్వానికి అమ్మ శిఖరం
మానవ తత్వానికి అమ్మ ఊపిరి
అమ్మ సజీవ స్రవంతి
అమ్మ వెన్నెల పాట
అమ్మ చనుబాలు ఔషధ నిధి
అమ్మ మాట సత్యనిష్ఠం
అమ్మ ఓ బౌద్ధధర్మ శాస్త్రం
అమ్మ త్యాగనిధి
అమ్మ తరగని అనురాగ స్రవంతి
అమ్మ మన పలక మీద మొదటి అక్షరం
అక్షరంలోని శిల్పమూ ఆమె
అమ్మ అక్షరం ఒక శిలాశాసనం
అమ్మ ఒక ప్రకృతి సౌందర్యం
నదీ తరంగాలలోని ప్రవాహశీలత ఆమెది
అమ్మ ఓ భాషా నిఘంటువు
అమ్మ మరపురాని స్మృతి
అమ్మ మన గాయాలను మాన్పే వైద్యురాలు
అమ్మ ఓ సుమతీ శతకం
అమ్మతనంలో కులమూ లేదు, మతము లేదు
అమ్మే ఒక విశ్వ దృశ్యగానం
పశుపక్షాదులకు అమ్మే తెలుసు
తండ్రిని కూడా సృష్టించింది అమ్మే
అతని ఆధిపత్యాన్ని
ఎదిరించింది కూడా అమ్మే
అమ్మ ఓ పోరుబాట
అమ్మ ఓ గణితశాస్త్రం
అమ్మలో జీవశాస్త్ర నిధులున్నాయి
తరగని నీటి బుగ్గలున్నాయి
అమ్మ స్వీకరించగలదు
నిరాకరించగలదు
అమ్మ ఉక్కు చక్రాలను తెంచింది
ఇనుప కచ్చడాలను ఛేధించింది
మొదట చేపలు పట్టింది అమ్మే
చేపను కాల్చిందీ అమ్మే
అమ్మ పడవను చేసింది
అమ్మ వేట కనిపెట్టింది
అమ్మ మొదట పులిని చీల్చింది
అమ్మ జలపాతాల సవ్వడిలో
నెమలి నృత్యాలను నేర్చింది
అమ్మ ఓ ఏటి పాట
అమ్మ జోల పాట కూడా
ప్రపంచ సాహిత్యానికి పల్లవి అమ్మే
అమ్మ తన మునివేళ్ళ నుండే
మొదటి కుండను చేసింది
అమ్మే మొదటి బుట్టా అల్లింది
అమ్మ ఓ పూలతోట
వసివాడని పరిమళం అమ్మే
నిప్పు కనిపెట్టింది అమ్మే
కొండలెక్కింది అమ్మే
పశువులను మచ్చిక చేసింది అమ్మే
విల్లంభు కనిపెట్టిది అమ్మే
విల్లంభు ఎక్కుపెట్టింది అమ్మే
అమ్మ తేనె తుట్టెను కదిపింది
అమ్మ నిన్నటి కూతురు
రేపటి అమ్మమ్మ, నానమ్మ కూడా
మా అమ్మ నేను జైలులో ఉన్నప్పుడు
కన్నీరు పెట్టింది
ఆ కన్నీటి బిందువులు నా గుండెలమీద
చెరగని స్మృతులయ్యాయి
అమ్మ ఒక వైద్యశాస్త్రం
అమ్మ యుద్ధానికి పాఠశాల
అమ్మ ఓ తెలంగాణా పోరాటం
అమ్మ బందూకు పట్టింది
అమ్మ దొరల గడులు కూల్చింది
అమ్మ కోటలు కట్టింది
కోట బురుజులు కూల్చింది
అమ్మ కొన్నిసార్లు రూళ్ళ కర్ర
అమ్మ స్వేచ్ఛా పావురాలు ఎగరేస్తుంది
అమ్మ ఓ వ్యక్తిత్వ నిర్మాణం
అమ్మ ఒక పాఠ్యపుస్తకం
అమ్మ ఒక దిక్సూచి
అమ్మ ఓ వ్యధ, ఓ ఆశ కూడా
అమ్మ బెల్లపన్నంలో నెయ్యి
కలిపి తినిపిస్తుంది
చియ్యలను నిప్పుల్లో కాల్చి
మునిపంటికి అందిస్తుంది కూడా
అమ్మ చేసిన కొండ గోంగూరలో
పెద్ద ఉల్లిపాయ, పచ్చి మిరపగాయలు,
కొత్తిమీర కలిపి ఉడకబెట్టి రుబ్బిన
పచ్చడి, ఆనాటికి ఈనాటికి అదే రుచి
అమ్మ పెరుగును కవ్వంతో
చిలుకుతున్నప్పుడు ఓ సృజన కర్త
వెన్నను కాస్తున్నప్పుడు వస్తున్న పరిమళం
అమ్మను గుర్తు చేస్తుంది
అమ్మ ఉప్పు చేప కాల్చి
దోసకాయ కూరకు నంజు
యివ్వడమే ఒక రుచి
అమ్మ ఓ జ్ఞాపకాల తోట
అమ్మ పుస్తకాలు కాదు
జీవితాన్ని చదివింది
అమ్మ మా చదువుల కోసం
రాళ్ళు మోసింది, నాట్లు వేసింది
కోతలు కోసింది
ఆమె చిరుగు పాతలు ధరించి
మాకు కొత్త బట్టలు కుట్టించింది
అమ్మది ఒక మంచి చూపు
అమ్మ ప్రేమకు గొప్పనిధి
అమ్మ ఒక నూత్న సృష్టి
అమ్మ తుఫాను వచ్చినప్పుడు
మా చిన్న తమ్ముడ్ని పొదిగిట్లో పొదిగి
వర్షం చుక్క పడకుండా
కాపాడిన గుర్తు
అమ్మ ఓ రక్షకురాలు
అమ్మ పాటకు మేఘాల నుండి
చిరుజల్లులు కురుస్తాయి
అమ్మ ఓ ఓపిక! ఓ సహనం!
అమ్మ చిరునవ్వుకు
వెన్నెల ఓడిపోతుంది
అమ్మ కొత్త భాషకు మురిసిపోతుంది
అమ్మ చివరి చూపు బిడ్డ కోసమే
అమ్మ మొదటి నవ్వు బిడ్డను చూసినపుడే
ఆమె నవ్వుల జల్లు
దుఃఖ సముద్రం కూడా!
కుష్టు రోగుల చీము తుడిచింది ఆమే
క్షయ రోగులకు సేవ చేసిందీ ఆమే
ఆమె దేశాంతరాలకు సేవకురాలు
ఆమె గ్రహాంతరాలకు వెళుతుందిపుడు
ఆమె బిడ్డను ఒడిగట్టుకుని
కొండలెక్కుతుంది కూడా
ఆమె బిడ్డను ఉరిమిచూస్తే
సింహాన్నైనా వధిస్తుంది
ఆమె ఆగ్రహం
ఆమె ఒక అనుగ్రహం కూడా
అమ్మ ఉన్నదంతా యిస్తుంది
ఏమి లేకుండా పోతుంది
ఆమెది అంతులేని చరిత
ఆమె పేరుతో ఒక రోజు కాదు
అన్ని రోజులు ఆమెవే
అమ్మకు నా శిరస్సు వంచి
అక్షరాభిషేకం చేస్తున్నాను
అమ్మే విశ్వ విజేత
(మాతృదినం స్ఫూర్తితో)

### నేటి కందం- నేటికి అందం

చణుడగు పుష్కర పురుషం
డనురాగము నందజేయు నమృతపు వేళన్
ఘనమగు సరస్వతీ నది
యనుకంపను బొందవలయు నాత్మజ్ఞతతోన్ !!



-రాధశ్రీ
సెల్:9494481210

(15-5-25 సరస్వతీ నదికి పుష్కరాలు ప్రారంభం )

### జీవజలం చలం

సాహిత్య స్మారకోపన్యాస సభ

8.5.2025 ఆదివారం సాయంత్రం 6 గంటలకు రవీంద్రభారతి, కాన్ఫరెన్స్ హాలులో చలం సాహిత్య స్మారకోపన్యాస సభ జరుగుతుంది


చలం స్త్రీ, ప్రేమలేఖల గ్రంథాలపై
కె. ఎన్. మల్లీశ్వరి, నెల్లుట్ల రామాదేవి ప్రసంగిస్తారు

మామిడి హరికృష్ణ ఆప్తవాక్యం పలుకుతారు

చలం స్త్రీ, ప్రేమలేఖలలోని కొన్ని ముఖ్య భాగాలను -
డా. సలీమా, డా. లక్ష్మి అనిరెడ్డి, డా. దాసోజు పద్మావతి, డా. శ్రీ భాష్యం అనురాధ, నస్రీన్ ఖాన్ ల వినిపిస్తారు

ఈ సభకు మీరు తప్పక రావాలని మనవి

-- నాళేశ్వరం శంకరం
కన్వీనర్, చలం భావన




### ఘంటారావం

మమత
మెరవనీ
జనత
మురవనీ.

ప్రచారం కోసమే
పని చేస్తారా
వృక్షాన్ని రక్షించే
వేర్లను వీక్షిస్తారా.

అక్షరాల్నీ
వెదజల్లు
ఆలోచనలై
విరాజిల్లు

తెగులు
తొలగనీ
తెలుగు
వెలగనీ.



-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964



సాహిత్యం, సామాజిక నిర్వహిస్తున్న

### 'బుధవారం బాద్షా' పోటీ ఫలితాలు



అడ్మిన్: రమాదేవి
8985613123



నిర్వహణ:
శ్రీమతి సత్య నీలిమ

### చల్లనైన వెన్నెల

శిశువు బాధ తెలుసుకుని లాలించునది అమ్మేకదా
కోరకనే కాచి పెంచు పిల్లలను అమ్మసదా.
ఆది గురువు ఆమేయయి బోధజేయు బిడ్డలకు
అమ్మ మాట వేదసమము అమ్మ మనసు అమృతము.
అల్లరైన ఆటలైన మురిసిపోవు అమ్మ యెపుడు
కథలనెన్నొ చెప్పుచూ తీర్చిదిద్దు నమ్మయెపుడు.
కలనైన బిడ్డసుఖము అమ్మేకద కోరుతుంది
ఆకలైన బిడ్డకొరకు అన్నమై నిలచునది.
తన యూపిరి యున్నవరకు బిడ్డ కొరకు ప్రాకులాడు
వేదనలో వేకువలా వెలుగు చూపు మనకు తోడు.
అమ్మ సాటి రాదు కదా ఈ జగాన యే దైవము
కన్నయ్యే ప్రేమకోరి పొందెను యశోద అనురాగము.
అమ్మ కమ్మనైన ప్రేమ మనకు చల్లనైన వెన్నెల
అమ్మ ఒడియె మనసుకు హాయి నిచ్చు కోవె
అమ్మ ఇచ్చు దీవెన మన మనసుకు సాంత్వన
అమ్మ మాట అమృతసమం తీర్చు కదా మన కామన.
అమ్మ పాట లలితము అందున్నది అమృతము
అమ్మ గూర్చిన ప్రతి మాట అవనిలో సూనృతము.

- వరలక్ష్మి యనమండ్ర

### అమృతమూర్తి

చల్లని వెన్నెలనిచ్చే జాబిలమ్మలా
దాహం తీర్చే జలదేవతలా
పసిడి పంటలు పండించే పుడమితల్లిలా
కీడు చేసే వారికీ మేలు చేసే సహృదయం కలది మాతృమూర్తి!.
పురిటి నెప్పులను పంటి బిగువుతో భరిస్తూ
పొత్తి కడుపులో నీవు తన్నే తన్నులను ఆనందంగా అనుభవిస్తూ
అమ్మ అనే నీ తొలి పిలుపుకై నిరీక్షిస్తూ
తాను పునర్జన్మను పొంది
నీకు జన్మను ప్రసాదించే అపరబ్రహ్మ అమ్మ!
తనకు మారుగా అమ్మను సృష్టించాడు బ్రహ్మ!!.
అమ్మ హృదయం అమృతపు గని
అందరికి ప్రేమను పంచడమే ఆమె పని!
ఆమెను సేవించడమే కావాలి మన విధి!.
తాను తిన్నా తినకున్నా
నీకు మస్తుగా పెట్టి తాను పస్తులుంటుంది
తాను పడ్డ కష్టములు నీవు పడకూడదని
అన్నింటిలో అందరికన్నా మిన్నగా నీవు ఉండాలని
మనస్ఫూర్తిగా శ్రమించే శ్రమజీవి అమ్మ
భువిలో వెలసిన దేవతే అమ్మ!
ఆమె సేవతోనే తరిస్తుంది మానవజన్మ!!!.

-డా. ఆళ్ళ నాగేశ్వరరావు( కమల శ్రీ )
7416638823

### మాతృమూర్తి

అమ్మ కడుపులో అంధకారంలో
అటూఇటూ తిరిగినా
ఆ తొమ్మిది నెలలు గర్భకోటలో కొదమ సింహాన్నే!
జలకాలకు నీటిబకెట్టే నా మానస సరోవరం!
దోగాడే వేళ దర్పానికి దర్జాలకు
అమ్మ మంజీర చరణాలే నా సింహాసనం!.
అమ్మ ప్రసాదించిన క్షీరధారలే నాకు అమృత భానీడం
గోమును మారామును చిరునవ్వుతో తిలకిస్తూ
అమ్మ తినిపించిన గోరుముద్దలే నాకు
దినదిన ప్రవర్ధమానానికి ప్రాకారాలు!.
అమ్మ చీరకొంగే నా ముక్కూ మూతి తుడిచే రుమాలు
అప్పుడప్పుడు నా అల్లరి చేష్టలకు
నాపై చిందులేసే నాన్న కోపానికి
అమ్మ చీరకొంగే నాకు రక్షణకవచం!
అన్నం తినిపిస్తూ అమ్మ చెప్పిన నీతికథలు
ఉన్నత విద్యల ఎదుగుదలకు చక్కటి సోపానాలు!
మరువలేని మమకారపు మకరందాన్ని
ఆత్మీయంగా పంచిన ఆదిగురువు అమ్మ!
కాలగమనంలో నేడు అమ్మ లేకపోయినా
ఆమె నవ్వులు ఇప్పటికీ సందడి చేస్తున్నాయి
మా ముద్దుల మనవరాలి బోసినవ్వులా.

-ఆకుమళ్ల కృష్ణదాస్

### త్యాగశీలి

ఆప్యాయతకు ప్రతిరూపం అమ్మ
అనుభూతికి ఆనవాలు అమ్మ
త్యాగానికి నిర్వచనం అమ్మ
జగతిన నడయాడే దైవం అమ్మ.
ప్రతిక్షణం నీకై తపించే అమృతమూర్తి
తన జీవితాన్ని నీకై అర్పించే త్యాగశీలి
తను ఓడుతూ
నిను గెలిపించే కరుణామూర్తి
తను ఆరిపోతు
నిను వెలిగించే సహనశీలి.
నిను కని పెంచి పోషించి
నీ నడకలకు నడతలు నేర్పి
నిను ఉన్నత శిఖరాల నెక్కించి
తను ఆనందపడే అపురూపం
అమ్మ.
నీ జీవితానికి అందమైన
దారి చూపేది
నీ బతుకున వెన్నెలలు నింపేది
నీ కళ్ళల్లో
సంతోష జ్యోతులు వెలిగించేది
నీ అభివృద్ధిని ఎప్పుడు కాంక్షించేది.
అమ్మా... నీకు పాదాభివందనం
తీర్చుకోలేము నీ ఋణం ఏ జన్మలో
చాలు ఈ జన్మకు
నీవు పంచిన ప్రేమామృతం
మరుజన్మకైనా పుడతాను
నీ కడుపున బిడ్డనై

-వనపర్తి గంగాధర్, హన్మకొండ

(1897-1951)

# శ్రీ న్యాయపతి నారాయణమూర్తి




1897లో బరంపురంలో జన్మించారు. తండ్రి రామానుజస్వామి తల్లి అనంతలక్ష్మి తండ్రి పెద్ద లాయర్.

గాంధీ పిలుపు యావద్దేశాన్ని ప్రభావితం చేసినట్లే గంజాం జిల్లాను ప్రభావితం చేసింది. ఏడేళ్ల వయసులో వందేమాతరం నినాదం ఇచ్చి పోలీసుల దృష్టిని ఆకర్షించారు. 1921లో మద్రాస్‌లో చదువుతున్న బి.ఏ. ఆపేసి జాతీయోద్యమం లో ప్రవేశించారు. మద్యం షాపుల ముందు పికెటింగ్‌లో పాల్గొని 1922లో నెలరోజులు జైలు శిక్ష అనుభవించారు. 1930లో ఉప్పు సత్యాగ్రహోద్యమంలో పాల్గొని మూడు నెలలు ఒకమారు- ఒక సంవత్సర కాలం ఇంకోమారు బరంపురం, కడలూరు జైళ్లలో ఉన్నారు. రాజకీయ ఉపన్యాసాలతో ప్రజలను ఉత్తేజపరచేవారు. 1945లో గంజాం-విశాఖ జిల్లాల సంయుక్త నియోజక వర్గం నుంచి సెంట్రల్ అసెంబ్లీకి ఎన్నికైనారు. ఆ ఎన్నికలలో ఆయనకు వచ్చినన్ని ఓట్లు దేశంలో ఎవరికి రాలేదట! ప్రజలలో అంత అభిమానం సంపాదించుకున్న దేశభక్తుడు నారాయణమూర్తిగారు.

విద్యార్థి దశలోనే తెలుగు వ్యాస రచన, వక్తృత్వం, నటన కవితా రచన పట్ల ఆసక్తి చూపేవారు. కళ్ళికోట కళాశాల, బరంపురంలో లోయర్ సెక్షన్‌లో ఉపాధ్యాయునిగా ఉన్న వెలువలి వీరరాఘవస్వామి వేయించే కన్యాశుల్కం నాటకంలో నారాయణమూర్తి మధురవాణిగా నటించేవారు. పత్రికారంగానికి ఆయన చేసిన సేవలు అమూల్యమైనవి. ఆంధ్రవాణి, భారతి, కళింగ పత్రికలను స్వాతంత్ర్య సమరదీపికలుగా నిర్వహించారు. ఆయన శైలిలో గాంభీర్యం ఉద్రేకం ఎక్కువ. ఆంధ్రప్రభలో సంపాదక బాధ్యతలు నిర్వహించారు. 1933లో గరిమెళ్ళ సత్యనారాయణ గారు మద్రాస్ వెళ్ళి ఆంధ్రప్రభలో సహాయ సంపాదకులుగా వీరితో పాటు పనిచేశారు. అలాగే నార్ల, శ్రీశ్రీ కూడా ఆంధ్రప్రభకు వీరు సంపాదకులుగా ఉన్న సమయంలో సహాయ సంపాదకులుగా పని చేశారు. ఆయన సంపాదకీయాలతో పాటు, నిర్వహించిన పాన్ సుపారి కాలమ్ పాఠకులను ఎక్కువ ఆకర్షించేది. ఆంధ్రప్రభ నుంచి బయటకు వచ్చాక విజయప్రభ అనే పత్రిక కొన్నాళ్ళు నడిపారు. చివరి రోజులలో జై భారత్ పత్రిక నిర్వహిస్తూ కాన్సర్‌తో కన్ను మూశారు.


'రేడియో అన్నయ్య' న్యాయపతి రాఘవరావు వీరి తమ్ముడు.






డా॥తుర్లపాటి రాజేశ్వరి వెలువరించిన "భారత స్వాతంత్ర్యోద్యమంలో ఒడిశా తెలుగు యోధులు" గురించి నేటినిజం పాఠకుల కోసం..

# శ్రీ వుప్పల లక్ష్మణరావు



**రచన: పరిశోధన, దేశభక్తిల మూర్తిమత్వం వుప్పల లక్ష్మణరావు, తల్లిదండ్రులు: వుప్పల సుందరమ్మ వుప్పల నరసింహారావు.**

లక్ష్మణరావు తాతగారు దిగుమర్తి వేంకట రామయ్య పంతులు బరంపురంలో ఫస్ట్ గ్రేడ్ ప్లీడర్‌గా, విద్యావేత్తగా పేరు గడించారు. వీరు కుమార్తె లందరినీ విద్యావంతులుగా తీర్చిదిద్దారు. లక్ష్మణరావు వేంకట రామయ్యగారి కుమార్తె కొడుకు. లక్ష్మణరావు బాల్యం, చదువు బరంపురంలోనే సాగింది.

స్వదేశీ ఉద్యమం ప్రారంభంలో లక్ష్మణరావు తను మేనమామ దిగుమర్తి విశ్వనాథరావు నాయకత్వంలో వారి కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. చిన్నా, పెద్దా కుటుంబ సభ్యులందరూ కర్ర డంబెల్స్ చేతిలో పట్టుకొని, ఇద్దరేసి చొప్పున వరసగా నిలబడి వందేమాతరం నినాదం ఇచ్చుకుంటూ డొళువా వీధి చివరి వరకూ వెళ్ళేవారు. వారు చిన్ననాడు పాడిన పాట.

1) "హిందూమాతా! నిన్ను వేదని మందబుద్ధిని మాన్పుమా అందమైన స్వదేశీ వస్తువులందు మా మది నిల్పుమా.."

2) "వందే వందే సదా, స్వదేశ మాతరం సదయ హృదయ జనని నీకు చక్క మ్రొక్కెదన్"
నీలో నెంతేని చూడ లోపమున్ గనం!"
సర్వాపరాధములును మానె చాలా సిగ్గగున్"

3) "హిందువులారా! వందే మాతర మనుడీ ఆర్య సంతతి వారమౌః మనకందరకు సుభ దాయకంబగు వందే మాతర మనుడీ"

4) "రాజ పుత్రుని, అజిత సింహుని రమ్యసద్గుణ తిలకునీ, భూరి సన్నుత బిపిన చంద్ర, సురేంద్ర నాథుల బ్రోవుమా"(బతుకు పుస్తకం పుట-33)

భారతదేశంలో పరిశ్రమలు స్థాపించాలని తిలక్ పైసాఫండ్ నిధి అని ఒకదాన్ని రూపకల్పన చేశాడు. ఆ పైసాఫండ్ నిధి సేకరణ నిమిత్తం దిగుమర్తి విశ్వనాథరావు నాయకత్వం కింద ఏర్పడిన జట్టులో లక్ష్మణరావు ఉండేవారు. సేకరించిన డబ్బును పూనా పంపేవారట! అలాగే చెన్నపట్నం నుంచి సుబ్రమణి అయ్యర్ పిలుపుతో దీపావళి రోజున నేషనల్ ఫండ్ పేరుతో డబ్బును సేకరించేవారు. దానిలోనూ లక్ష్మణరావు పాల్గొన్నారు. జాతిరయోద్యమంలో బాగంగా రూపు దాల్చిన గ్రంథాలయోద్య మంలో లక్ష్మణరావు విశ్వనాథరావు నాయకత్వాన రూపుదిద్దుకున్న గ్రంథాలయం స్థాపనలో పాలు పంచుకున్నారు. గ్రంథాలయం పేరు యంగ్ మెన్స్ లైబ్రరీ అండ్ అసోసియేషన్, స్థాపితం 1909 . హోమ్ రూల్ ఉద్యమంలో పాల్గొనేవారు. అలాగే ప్రతిరోజు బారక్సు మైదానంలో జరిగే బహిరంగ సభలకు హాజరయ్యేవారు. 1919 జలియన్ వాలాబాగ్ హత్యాకాండ తరువాత దేశంలో ఆందోళనలు ఎక్కువైనాయి. బ్రిటీష్ వారి దమనకాండ ప్రజలకు బాగా అర్థమైపోయింది. ఈ నేపథ్యంలో మాంటేగ్యూ ఇండియాకు వచ్చినపుడు తక్షణమే వలసరాజ్య ప్రతిపత్తిని డిమాండ్ చేస్తూ ఒక విజ్ఞాపన పత్రం ఆయనకు సమర్పించాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఆ విజ్ఞాపన పత్రం వివరాలను ప్రజలకు వివరించి, వారి సంతకాలు సేకరించే ఉద్యమం ఇందులో భాగం. లక్ష్మణరావు, గిరిగారు, నాభి రామకృష్ణారావుగారు, ఎర్రబోలు అప్పల నరసయ్య నరసయ్య నాయుడు గార్లతో కలిసి గోపాలపురం, సోంపేట, ఉద్దానం, బారువా హరిపురం మొదలైన గ్రామాలు తిరిగి సంతకాలు చేయించారు. అవన్నీ కలిపి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీకి పంపారు.

చిన్ననాడే జాతీయోద్యమంలో పాల్గొన్న లక్ష్మణరావు తన చదువును కలకత్తాలోనూ, జర్మనీలోనూ సాగించి ట్యూబింగెన్ విశ్వవిద్యాలయం నుంచి బోటనీ పరిశోధనలకి డాక్టరేట్ పట్టా 1924-25లో అందుకుని స్వదేశం తిరిగివచ్చారు. 1922లోనే వారు సాహిత్య సృజనకు శ్రీకారం చుట్టారు.

1929 డిసెంబర్‌లో జరిగిన లాహోరు కాంగ్రెస్ సభలకు లక్ష్మణరావుగారు, మెల్లీగారితో పాటు వెళ్లారు. అప్పటికి వారు అలీఘర్ ముస్లిం యూనివర్సిటీలో బోటనీ లెర్చరర్‌గా ఉద్యోగం చేస్తున్నారు. 1923 డిసెంబర్ 31 అర్ధరాత్రి రావినది ఒడ్డున జరిగిన కార్యక్రమంలో బ్రిటీష్ వారి నుంచి విడిపోయి అయినా సరే సంపూర్ణ స్వతంత్రం కోసం గాంధీజీ నాయకత్వాన అహింసాయుత పోరాటం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఆ తరువాత 1930 జనవరి 26న పై ప్రతిజ్ఞ జనాలు చేస్తూ దేశంలో ప్రతి ఊరిలో ఊరేగింపులో జరిగాయి. నాడు అలీఘర్‌లో జరిగిన ఊరేగింపులో లక్ష్మణరావు, మెల్లీ పాల్గొన్నారు. ఇక లక్ష్మణరావుగారూ, మెల్లీ సబర్మతీ ఆశ్రమానికి వెళ్లటం, అక్కడ ఉండటం విశేషం. గాంధీ 1930 మార్చి 12 "దండి మార్చి"కి ఉప్పు సత్యాగ్రహం ప్రారంభిస్తూ బయల్దేరారు. వారు లేనప్పుడు సబర్మతీ ఆశ్రమవాసుల జీవనం, క్రమశిక్షణ చూడాలని వీరి కోరిక. సబర్మతీ ఆశ్రమవాసులు జీవనం వీరికి నచ్చింది. అక్కడ నిరాడంబరంగా వారితో కాలం గడుపుతూ లక్ష్మణరావు నూలు వడకటం నేర్చుకున్నారు. తరువాత శ్రీకాకుళంలో మూడు నాలుగేళ్ళు ఉండి అఖిల భారత నూలువడుకు సంఘం కేంద్రంలో కొన్ని పరిశోధనలు చేశారు. రెండవ ఉప్పు సత్యాగ్రహం 1931-32 కాలంలో దేశమంతటా తీవ్ర నిర్బంధము అవలంబింపబడింది. ఆ సమయంలో దేశంలో అనేకచోట్ల ఖాదీ ప్రదర్శనలు జరిగాయి. లక్ష్మణరావు దంపతులు అనేక ఊళ్ళల్లో జరిగిన ప్రదర్శనలలో పాల్గొన్నారు. లక్ష్మణరావుగారు , మెల్లీ నూలు త్వరగా వడకటానికి వీలుగా ఒక బాల్ బేరింగ్, చరఖా రూపకల్పన చేశారు. ఈ చరఖా దంతులూరి లక్ష్మీనారాయణరాజు, విశాఖపట్నం వారి సహకారంతో అక్కడ కార్ఖానాలో తయారుచేయించారు. ఈ చరఖాను అనేక ఊళ్ళల్లో విజయనగరం, విశాఖ, మద్రాస్, అడయార్, నెల్లూరు, నర్సాపురంలలో ప్రదర్శించారు. నెల్లూరు ప్రదర్శనకు గాంధీ వచ్చి మెల్లీని పలకరించారు.

లక్ష్మణరావు గారు 1936-39 సంవత్సరాలలో ఆంధ్ర ప్రావిన్షియల్ కాంగ్రెస్ కమిటీ సభ్యులుగా చేశారు.

ఆంధ్రదేశంలో సుమారు ఇరవై ఏళ్ళు ఉద్యోగం చేసిన లక్ష్మణరావుగారు తరువాత పుష్కర కాలం మాస్కో ప్రగతి ప్రచురణాలయం, తెలుగు అనువాద విభాగంలో అనువాదకునిగా చేశారు. తెలుగు రష్యన్ నిఘంటువు నిర్మాణంలో ప్రధాన పాత్ర వహించారు. సుమారు 40 గ్రంథాలు అనువదించారు. 'అతడు-ఆమె' సృష్టికర్తగా తెలుగు సాహిత్యంలో ప్రసిద్ధి కెక్కారు.

ఈ అసాధారణ ప్రతిభామూర్తి 22-2-1985న బరంపురంలో కన్నుమూశారు.

# శ్రీ కొత్తకోట బాలకృష్ణపాత్రో

**బల్లిపదరొ**

వీరి స్వస్థలం బరంపురం నుంచి సుమారు 55 కి.మి.ల దూరంలో అస్కా సమీప గ్రామం బల్లి పదరొ.

శ్రీ బాలకృష్ణపాత్రో స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నారు. చుట్టు ప్రక్కల గ్రామ ప్రజలను ప్రభావితం చేసిన నాయకులు.

# శ్రీ దిగుమర్తి విశ్వనాథరావు



**బరంపురం ( - 1912)**
**తల్లిపేరు: రాజ్యలక్ష్మి**
**భార్య: లక్ష్మీ నరసమ్మ**

దిగుమర్తి వెంకట రామయ్యగారి కుమారుడు. పుప్పల లక్ష్మణరావు గారికి మేనమామ. కళ్ళికోట కళాశాలలో ఎఫ్.ఏ. చదివారు.

నాడు దేశంలో జరుగుగుతున్న అనేక ఉద్యమాల పట్ల అవగాహన కలిగిన వ్యక్తి. జాతియోద్యమం వైపు ఆకర్షితురాలైనారు. తమ ఇంట్లో చిన్నా- పెద్దలందరినీ 'వందే మాతరం' ఉద్యమం వైపు నడిపి మార్గదర్శకులైనారు. వీరి నాయకత్వం కింద ఉదయమే ఇంట్లో ఉన్న సుమారు ముప్పై మంది ప్రతి ఒక్కరూ డంబెల్సు చేత బుచ్చుకుని, ఇద్దరేసి చొప్పున వరస తీర్చి, వొకరి వెంకట వొకరు వందేమాతరం నినాదం ఇస్తూ, మార్చి చేస్తూ కొంత దూరం వెళ్ళేవారు. ఆ మార్చి చేస్తూ "హిందూ మాతా.. నిన్ను వేదని మంద బుద్దిని మాన్పుమా" (ఈ పాట వుప్పల లక్ష్మణరావు శీర్షిక క్రింద వ్రాశాను) పాడేవారు.

దేశంలో పరిశ్రమలు స్థాపించాలనే ఉద్దేశంతో తిలక్‌గారు పైసాఫండ్ నిధిని స్థాపించారు. ప్రతి వొక్కరూ వొక్క పైసా ఇస్తే చాలు అని వారి ఉద్దేశం. దానికి కూడా విశ్వనాథ రావు నాయకత్వం వహించి, హుండీ డబ్బాలలోకి డబ్బు ఊళ్ళో వసూలు చేయించి పూనా పంపించేవారు. అలాగే మద్రాసులో జి. సుబ్రమణి అయ్యరు తలపెట్టిన 'నేషనల్ ఫండ్' అనే డబ్బు సేకరణ ఉద్యమానికి కూడా విశ్వనాథరావు డబ్బు సేకరించి పంపేవారు.

స్వతంత్రోద్యమంలో ఒక భాగంగా గ్రంథాల యోద్యమం ఆంధ్ర అంతటా విస్తరించింది. విశ్వనాథ రావు 'యంగ్‌మెన్స్ లైబ్రరీ అడ్ అసోసియేషన్' పేరుతో 1909లో గ్రంథాలయం స్థాపించారు. ఇది తొలుతగా బరంపురం బొగ్గుల వీధిలో ఊటుకూరి గోపాల్రావుగారి ఇంటి వసారా గదిలో ప్రారంభించారు.

ఈ గ్రంథాలయం స్థాపనలో బచ్చు రామగోపాలం, బచ్చు నరసింహస్వామి, గిరిగార్లు సాయం చేశారు. ఇందులో ప్రధానంగా ఆంగ్లేషు పుస్తకాలే ఉండేవి.

విశ్వనాథరావు గొప్ప మానవతావది. వీరు కొందరు యువకులతో కలిసి అన్నదాన కార్యక్రమా నికి శ్రీకారం చుట్టారు. ఆ యువకులలో వుప్పల లక్ష్మణరావు వొకరు. వీరంతా ప్రతి ఇంటికీ వెళ్లి ఒక బుట్ట ఇచ్చి వారితో "అందులో రోజూ ఒక పిడికెడు బియ్యం వెయ్యండి. మేం వారం వారం వచ్చి ఆ బియ్యం తీసుకెళతాం. వాటితో బారకాసు గ్రౌండ్‌లో వికలాంగులకు అన్నదానం చేస్తామని చెప్పేవారు.

ఆ సంస్థ పేరు 'చారిటీ ఫండ్ అసోసియేషన్". అంతే కాకుండా విశ్వనాథరావు తన బృందంతో ఊళ్ళో ఉద్యగస్థులుగా ఉన్న దొరలను కలుసుకుని వారి వద్ద నుంచి నెలకు రెండు రూపాయల నుంచి ఐదు రూపాయల వరకూ వసూలు చేసేవారు. ఇలాగ ఈ అన్నదాద కార్యక్రమం 4-5 ఏళ్ళు సాగింది.

1912లో హఠాత్తుగా జ్వరంతో కన్నుమూశారు. అప్పటికి వారి కుమారుడు రామారావు వయసు రెండేళ్ళు. విశ్వనాథ రావు మరణానంతరం వారి తండ్రిగారు దిగుమర్తి వెంకట రామయ్య గ్రంథాలయానికి ఒక భవనం కట్టించి ఇచ్చారు.

అదే ఇప్పుడు బరంపురంలో మున్సిపల్ గ్రంథాల యంగా మారింది.

# శ్రీ దిగుమర్తి హనుమంతరావు



**తండ్రి: దిగుర్తి రామదాసు**
**తల్లి: బంగారమ్మ**
**భార్య:బుచ్చికృష్ణమ్మ**

తండ్రిగారు బాల్యంలో చనిపోవటంచేత పెద్ద నాన్నగారైన దిగుమర్తి వేంకట రామయ్య గారింట్లో, బరంపురంలో పెరిగారు. బరంపురంలో ప్రాధమిక విద్య, అనంతరం కళ్ళికోట కళాశాలలో ఎఫ్.ఏ. చదువుకున్నారు. పిమ్మట పచ్చయప్ప కళాశాల, మద్రాస్‌లో బి.ఏ. చదువుతూ గోఖలే శిష్యులైనారు. హనుమంతరావు హేతువాద దృక్పథం, ఆయన వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దిన సంఘటనలని, వుప్పల లక్ష్మణరావు గారు బతుకు పుస్తకంలో నమో చేసిన విషయాన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. దిగుమర్తి వెంకట రామయ్య గారింట్లో రాత్రి భోజనాలు ముగిసాక పదిగంటల సమయంలో ఇంట్లో ఉన్నవారందరూ చావడిలో కూర్చునేవారు. వేంకట రామయ్య గారు అప్పుడు హనుమంతరావు చేత R.P.A. Rationalist Press Association వారి ప్రచురణ కర్నల్ యింగర్ సాల్ అనే (Agnostic) వుపన్యాసాలను చదివించి, స్త్రీలకు తెలియడానికని తెలుగున అనువదించి బోధపరిచి చెప్పించేవారు. ఆ పుస్తకం అయిన తరువాత తామస్ పెయిన్ అనే ప్రఖ్యాత పురుషుడు రాసిన రైట్స్ ఆఫ్ మన్ (Rights of man) అనే పుస్తకం చదివించి బోధపరిచి చెప్పేవారు" (బ్రతుకు పుస్తకం, పే. 46)

మద్రాస్‌లో ఉండి సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీ కార్యక్రమాలు పర్యవేక్షిస్తూ, సబర్మతీ ఆశ్రమానికి రాకపోకలు సాగిస్తూ గాంధీజీ నిర్మాణ కార్యక్రమాలను నిశితంగా అధ్యయనం చేస్తూ వచ్చారు. వీరి వివాహం బుచ్చి కృష్ణమ్మతో అయింది. ఈమె ప్రముఖ చిత్రకారులు దామెర్ల రామారావుగారి చెల్లెలు. మంచి చిత్రకారిణి కూడా.


హనుమంతరావుకు హిందీ ప్రచారం, చేనేత, ఖాదీ, అస్పృశ్యతా నిర్మూలన ప్రియమైన విషయాలు. ఈ దంపతులు ఆజన్మ బ్రహ్మచర్య వ్రతం స్వీకరించారు. గాంధీజీ, దేవదాస్ గాంధీకి హిందీ ప్రచార కార్యక్ర మాన్ని అప్పగించి మద్రాసులో మనుమంతరావు పర్యవేక్షణలో ఉంచారు. హనుమంతరావు దంపతుల వ్యక్తిత్వం గాంధీజీ, కస్తూరిబాయి దంపతులకు చాలా నచ్చింది. సబర్మతిలో నెల్లూరికి చెందిన చతుర్వేదుల వెంకటకృష్ణ హనుమంతరావుకి మిత్రులైనారు. మద్రాస్ ప్రెసిడెన్సీలో సత్యాగ్రహ ఆశ్రమము ఒకటి ప్రారంభించాలని గాంధీజీ తలచారు. దానికి చతుర్వేదుల కృష్ణ తన కుటుంబ భూములను ఆశ్రమానికి ఇస్తానని ముందుకు వచ్చారు. శ్రీమతి పాణకా కనకమ్మ పల్లెపాడులో పదమూడు ఎకరాల భూమిని ఇచ్చారు. అందులో పాణకా సుబ్బిరామిరెడ్డి (కనకమ్మగారి భర్త) ఏడెనిమిది పాకలు వేయించారు. ఆ విధంగా గాంధీజీ సంకల్పానుసారం పల్లెపాడులో పినాకిని సత్యాగ్రహ ఆశ్రమం ఏర్పాటైంది. 1921 ఫిబ్రవరి 7న గాంధీజీ పల్లెపాడు వచ్చి ఆశ్రమం ప్రారంభించి, ఆశ్రమ బాధ్యతలు హనుమంతరావుకి అప్పగించారు. ఆ ప్రారంభ దినాలలో ఎన్నో కష్టనష్టాల కోర్చి ఆశ్రమం ఆశయాలను ప్రచారం చేశారు హనుమంతరావు. ఎంతో మంది గాంధేయ వాదులు, జాతీయోద్యమ నాయకులు ఆశ్రమానికి వచ్చి స్ఫూర్తి పొందేవారు. 1925 నాటికి ఆశ్రమానికి భవనం కూడా ఏర్పాటైంది.

1926 మార్చిలో క్షయవ్యాధితో హనుమంతరావు కన్నుమూశారు. నెల్లూరు, పల్లెపాడు సత్యాగ్రహ ఆశ్రమానికి బహిర్ రూపం సి.వి. కృష్ణ అనుకుంటే ఆత్మ వంటి వారు హనుమంతరావు అని పెద్దలు చెబుతారు.

శ్రీమతి బుచ్చి కృష్ణమ్మ భర్త మరణానంతరం శాంతినికేతన్ వెళ్ళి చిత్రకళకి మెరుగులు దిద్దుకున్నారు. తరువాత ఆమె మద్రాసులో ఉపాధ్యాయినిగా కొన్నాళ్ళు, ఉద్యోగం చేసి పిమ్మట సీతానగరంలో కస్తూరిబాయి గాంధీ పేరిట స్థాపించిన ఆశ్రమంలో శేష జీవితం గడిపారు.

# శ్రీమతి గాదె లక్ష్మీ నరసమ్మ

1915-1992



తల్లితండ్రులు: శ్రీ బచ్చు చిన్న నరసింహస్వామి శ్రీమతి చూడి కుడుత్తమ్మ
భర్త: హైకోర్ట్ న్యాయవాది గాదె రంగారావు

**బాల్యం, విద్యాభ్యానం:** బరంపురం లో, 5,6 తరగతుల వరకూ చదువుకున్నారు. పిమ్మట పినతండ్రి బచ్చు జగన్నాథ దాస్ గారింట్లో మద్రాస్‌లో కొన్నేళ్ళు ఉన్నారు. జగన్నాథ దాస్ మద్రాస్ హైకోర్ట్‌లో న్యాయమూర్తిగా ఉండేవారు. లక్ష్మీ నరసమ్మ హైస్కూలు చదువు, కళాశాల చదువు అచ్చటే సాగింది. తమిళం, హిందీ, ఆంగ్లం బాగా నేర్చుకున్నారు.

**గాంధీజీ ప్రభావం:**

మద్రాస్, బరంపురం నగరాలలో ఆమె జాతీయోద్యమంలో పాల్గొన్నారు. స్త్రీవిద్య, ఖద్దరు ప్రచార ఉద్యమాలలో ఆమె అత్యంత ఆసక్తితో పాల్గొనేవారు. ఎల్లప్పుడూ ఖద్దరు చీరెలే ధరించే వారు.

ఆంధ్ర మహిళా సమాజం, బరంపురం అధ్యక్షురాలిగా, కార్యదర్శి గా సేవ చేశారు. ఆమె ఆధ్వర్యంలో మహిళా సమాజం స్వర్ణోత్సవాలు, వజ్రోత్సవాలు వైభవంగా జరిగాయి.

1992 ఫిబ్రవరి 2వ తేదీ, భువనేశ్వర్‌లో లక్ష్మీ నరసమ్మ గారు కన్నుమూశారు.

## స్వాతంత్ర్య సమరయోధుడు, సేవా తత్పరుడుఃపండిత శ్రీ ఉన్నవ వెంకట వరాహ బుచ్చి రామలింగం పంతులు(1884-1962)



1884 అక్టోబర్ 23న బరంపురం సమీపంలో వున్న ఛత్రపురంలో జమీందారి బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. మద్రాస్ ప్రెసిడెన్సీ కళాశాలలో బి.ఏ.బి.ఇడి. రాజమండ్రిలో చదివారు. కళ్లికోట కళాశాల, బరంపురంలో 1904లో గణితశాస్త్ర అధ్యాపకునిగా ఉద్యోగ జీవితం ప్రారంభించారు. ఉదాత్త వ్యక్తిత్వంతో విద్యార్థులను ప్రభావితం చేశారు. భారత రాష్ట్రపతి వి.వి. గిరి, సుప్రీంకోర్ట్ ప్రధాన న్యాయమూర్తి బచ్చు జగన్నాథదాస్, ఒరిస్సా చీఫ్ జస్టిస్ లింగరాజ్ పాణిగ్రాహి మొదలగు ప్రముఖులు ఆయన శిష్యులు.

### ఉద్యమ నాయకత్వం

గాంధీజీ సమర శంఖారావానికి ఉత్తేజితులై రామలింగం వృత్తిని వదిలిపెట్టి జాతీయోద్యమంలో ప్రవేశించారు. నాటి నుంచి ఖద్దరు వస్త్రాలు, ఆకు చెప్పులు వారి ఆహార్యం. 1924లో కాకినాడలో జరిగిన కాంగ్రెస్ మహాసభలకు కార్యనిర్వాహక కార్యదర్శిగా సేవలందించారు. చారిత్రాత్మక నౌపడా ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో బరంపురం నుంచి కాంగ్రెస్ వాలంటీర్లను సమీకరించి నౌపడా యాత్ర చేపట్టారు. నాడు రామ లింగంగారితో సన్నయ్య పంతులు, ఎల్లాయి సూరమ్మ, గౌతు లచ్చన్న మరియు అనేక మంది ఉన్నారు. 1930 ఏప్రిల్ 19వ రాత్రి శ్రీకాకుళం డివిజినల్ సబ్ కలెక్టర్, అస్టిన్ వీరిని అరెస్ట్ చేసి నెల్లూరు జైలుకు పంపారు. రెండేళ్ల జైలు జీవితం వీరికి సుప్రసిద్ధులైన నాయకుల సాహచర్యం లో గడిచింది. డి.డా. భోగరాజు పట్టాభి సీతారామయ్య, భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షులు, సి. రాజగోపాలాచారి, ఫార్మర్ గవర్నర్ జనరల్ ఆఫ్ ఇండియా మున్నగువారు ఉండే వారు. జైలులో వీరు తమిళము, ఉర్దూ, మాట్లాడటం రాయటం నేర్చుకున్నారు. తెలుగు కొందరికి నేర్పారు.

సహాయ నిరాకరణ ఉద్యమంలో 1932 ఫిబ్రవరి 5న అరెస్ట్ చేశారు. 1942 క్విట్ ఇండియా ఉద్యమ సందర్భంగా బారాక్స్ మైదానం దగ్గర వున్న కాంగ్రెస్ భవన్ దగ్గర బహిరంగ సభలో ప్రసంగిస్తున్నపుడు అరెస్ట్ చేసి జైలుకి తరలించారు. బరంపురం సెంట్రల్ జైల్లో మూడు నెలలు జైలు విక్ష అనుభవించారు.

### సహకార ఉద్యమం అర్బన్ బ్యాంకు స్థాపన:

బరంపురంలో సహకార బ్యాంకు వ్యవస్థాపకులలో ఒకరు. 14 సంవత్సరాలు 1924-1938 కాలంలో అధ్యక్షులుగా సేవలు అందించారు. తూర్పు డివిజన్‌లో రిజర్వు బ్యాంకును కానీ, ప్రభుత్వాన్ని కానీ సహాయం కోరకుండా స్వతంత్రం గా పని చేస్తున్న ఉత్తమ బ్యాంకుగా అర్బన్ బ్యాంకు ఆ రోజులలో పేరు తెచ్చుకున్నది.

మున్సిపాలిటీ చైర్మన్‌గా రామలింగం పంతులు 1922-31 కాలంలో పని చేసి పట్టణ అభివృద్ధికి కృషి చేశారు. వచ్చే స్వల్ప నిధులతోనే సమర్థవంతంగా రోడ్ల నిర్మాణం, పారిశుద్ధ్య పనులు ఇతరాలు చేయించేవారు. ఉదయం కాలినడకన బరంపురం వార్డులన్నీ తిరగేవారు. మద్రాస్ ప్రెసిడెన్సీలో ఉత్తమ మున్సిపాలిటీగా బరంపురానికి గుర్తింపు తెచ్చిన ఘనత ఆయనదే. విద్యారంగం అభివృద్ధికి సోపానంగా 1929లో సిటీ హైస్కూల్ నిర్మాణం కోసం భూమిని కేటాయించారు.


### కార్మిక ఉద్యమం

శ్రీ వి.వి.గారి ఐర్లాండ్ నుండి తిరిగి వచ్చాక కార్మికోద్యమం లోనికి వీరిని రమ్మని కోరారు. రామలింగంగారు బెంగాల్, నాగపూర్ రైల్వే కార్మిక సంఘానికి అధ్యక్షులుగా కొన్నాళ్లు పనిచేశారు.

### ప్రభుత్వ సలహాదారు:

నాటి ఒడిశా ముఖ్యమంత్రి బిశ్వనాధ్ దాస్ కోరిక మేరకు 1939లో ప్రభుత్వ సలహా దారుగా సేవలందించారు. ఉత్కళ్ విశ్వవి ద్యాలయము అకడమిక్ కౌన్సిల్ సభ్యులుగా చాలా ఏళ్ళు ఉన్నారు. రామలింగంగారి సతీ మణి శ్రీమతి పిల్లమ్మగారు జాతీయోద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. తెలుగు జాతి గర్వించదగ్గ ఈ సహనీయుడు కటక్‌లో 1962లో కన్ను మూశారు.

# శ్రీ పోతాప్రగడ సింహాచలం పంతులు



బరంపురంలో సుప్రసిద్ధ కుటుంబంలో జన్మించారు. సింహాచలం పంతులు చిన్నప్పటి నుంచి చిత్రకళయందు ఆకర్షితులైనారు. చెన్నపురి Fine Arts College నుండి చిత్రకళలో డిగ్రీ పొందారు. వీరి చిత్రాలు రవివర్మ చిత్రాలతో సరిపోలుతాయని చిత్రకళాకారులు ప్రశంసించారు. ఆనాడు బరంపురంలో అనేక మంది ప్రముఖుల చిత్రాలను వీరు వ్రాశారు. అవి అనేక ఆఫీసులలో కొలువు తీరేవి.

1920వ సంవత్సరంలో స్వాతంత్ర్యోద్యమంలో ప్రవేశించి - తదాది ఉద్యమంలో పాల్గొన్న దేశభక్తులు, సంఘ సంస్కర్త. 1938లో హఠాత్తుగా కన్నుమూశారు.

# శ్రీ నాభి రామకృష్ణారావు



**తండ్రి: నాభి రామమూర్తి**
**తల్లి: సుబ్బాయమ్మ**
**భార్య: పద్మావతి**
**జన్మస్థలం: బరంపురం**

నాభి రామకృష్ణారావు మద్రాస్ క్రిస్టియన్ కళాశాల లో బి.ఏ. చదివి అనంతరం కుటుంబ వ్యాపారమైన ఆటో మొబైల్ రంగంలో ప్రవేశించారు.

ఒడిశా రాష్ట్ర సహకారోద్యమంలో ముఖ్యపాత్ర పోషించిన వీరిలో దేశభక్తి, ఆధ్యాత్మికత రెండూ వడుగూ పేకల్లాగ సమ్మిశ్రితమైనాయి.

జాతియోద్యమం వివిధ దశలలో వీరు ఉత్సాహంగా పాల్గొన్నారు. హోమ్‌రూల్ ఉద్యమంలో పాల్గొన్నారు. మాంటేగ్యూ ఇండియాకి వచ్చిన పుడు తక్షణమే వలసరాజ్య ప్రతిపత్తిని కోరుతూ విజ్ఞాపన పత్రం సమర్పించాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఆ విజ్ఞాపన పత్రంలో అంశాలను ప్రజలకు చెబుతూ, దాని మీద సంతకాలు తీసుకునే ఉద్యమం ప్రారంభమైంది. అందు లో నాభి రామకృష్ణారావు, గిరిగారితో, లక్ష్మణగారితో మరియు ఎర్రబోలు అప్పల నరసయ్య నాయుడి గారితో కలిసి గోపాలపురం, సోంపేట, ఉద్దానం, బారువా హరిపురం మొదలగు గ్రామాలు తిరిగి, ఆ సంతకాలను కాంగ్రెస్ వర్కింగ్ కమిటీకి పంపారు. 1932 ఉప్పు సత్యాగ్రహోద్యమంలో అరెస్టు అయి జైలుకెళ్లిన పండిత రామలింగం పంతులు, ఇమ్మిడిసెట్టి రామమూర్తి మొదలగు దేశభక్తుల మొదటితరం గ్రూపులో ఒకరు.


ఒడిశా రాష్ట్ర సహకారోద్యమంలో వీరు పోషించిన పాత్ర చిరస్మరణీయం. బరంపురం సెంట్రల్ కోపరేటివ్ బ్యాంక్‌కు గౌరవ కార్యదర్శిగా (BCCB) (1934-1936) అధ్యక్షునిగా (1948-70) సుదీర్ఘకాలం సేవలు అందించారు. జిల్లాలో చిన్న పరిశ్రమలను నెలకొల్పడానికి, రైతాంగం అభివృద్ధికి కృషి చేశారు. విరివిగా ఋణాలు అందించి ప్రోత్సహించేవారు. అలా రూపుదిద్దుకున్న వాటిలో "హుమ్మా సాల్ట్ ప్రొడక్షన్ & సేల్స్ సొసైటీ ఛత్రపురం ఒకటి.

రామకృష్ణారావు మద్రాస్ థియోసాఫికల్ సొసైటీలో సభ్యులు. ప్రతివారం సమావేశాలు నిర్వహించేవారు. సమావేశ ప్రారంభంలో భారతమాత పూజ నిర్వహణ ఉండేది. విశ్రాంత తహసీల్దారు బి.వి. నరసప్ప పంతులు ఈ పూజలో ప్రధాన పాత్ర వహించేవారు. వీరు కాంగ్రెస్ వాది. ఈ సమావేశాలు ప్రతి ఆదివారం కోపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఆవరణలో జరిగేవి. ఇది నిరాకారపూజ. దీపం వెలిగించి మంత్రాలు చదివేవారు. ఈ పూజా విధానం జిడ్డుకృష్ణమూర్తి కొన్ని ఉపనిషత్తుల లోని మంత్రాలతో రూపొందించినదని నాటి సమావేశాలలో పాల్గొన్న ఎమ్. భీమసేన్ రావు చెప్పారు. రామకృష్ణారావు ఎల్లప్పుడూ ఖద్దరు పంచె, ఖద్దరు చొక్కా ధరించేవారు. తెలుగుభాషాభివృద్ధికి వివిధ సంస్థల ద్వారా తోడ్పాటు అందించేవారు. వీరి సతీమణి పద్మావతి ఆంగ్లంలో కవిత్వం వ్రాసేవారని వీరి అన్నగారి కుమారులు డాక్టర్ ఎన్.ఆర్.కె. రావు తెలిపారు.

రచయిత్రి, కవయిత్రి, వ్యాసకర్త, గాయని కస్తూరి అలివేణి రెండవ కథా సంపుటి "ప్రతిబింబాలు" కు సినీ రచయిత భువనచంద్ర రాసిన ముందు మాట ఇది..

# అద్దంలో అలివేణి

ప్రియమైన పాఠకులకు నా హృదయ పూర్వక వందనాలు. అలివేణిగారు, వీరు బహుముఖ ప్రజ్ఞాశాలి. వీరికి అన్ని సాహితీ ప్రక్రియలలోనూ పరిచయం, ప్రవేశమే కాదు ప్రతిభవున్న రచయిత్రి. మంచి గాయని. గీత రచయిత్రి. వక్త, న్యాయనిర్ణేత కూడా.






ప్రియమైన పాఠకులకు నా హృదయ పూర్వక వందనాలు. అలివేణిగారు, వీరు బహుముఖ ప్రజ్ఞాశాలి. వీరికి అన్ని సాహితీ ప్రక్రియలలోనూ పరిచయం, ప్రవేశమే కాదు ప్రతిభవున్న రచయిత్రి. మంచి గాయని. గీత రచయిత్రి. వక్త, న్యాయనిర్ణేత కూడా. ఆల్ ఇండియా రేడియోలో వీరి కథలు ప్రసారమయ్యాయి. వివిధ పత్రికల్లోనూ వీరి కథలు ప్రచురించబడ్డాయి. కొనియాడబడ్డాయి. వీరి రచనలు ఒక ప్రత్యేకతను కలిగివుంటాయని, మొదటి కథ **"మాతృదేవోభవ"** చదవగానే అర్థమైంది. ప్రతి కథకి ఒక లక్ష్యం వుంది. కథను ఎలా నడిపించాలో వీరికి ఒక స్పష్టమైన అవగాహన వుంది అంతే కాదు వీరి కథల్లో ఏ భావమూ విషయమూ మళ్ళీ మళ్ళీ రిపీట్ కావు. ఏ కథ విశిష్టత దానిదే. చాలా కాలం తర్వాత చక్కని కథా సంకలనం చదివిన అనుభూతి రచయిత్రి నాకు కలిగించారు.

వృద్ధాశ్రమాల గురించి రాస్తూ, వ్యాపారంతో కూడిన సేవ.. మనిషి అవసరాలు పెరుగుతున్నాయి. అవసరాలకు తగ్గట్టు వ్యాపారాలు చోటు చేసుకుంటున్నాయి అంటారు. ఒకప్పుడు వృద్ధాశ్రమాల్లో అనాథలు వుండేవారు. ఈ వేళ ముసలి తల్లిదండ్రులు వుంటున్నారు. కారణం మనం చాలా ప్రగతి సాధించాం కదా!

రచయిత్రి అంటారు తల్లి స్థానంలో వున్న ఏ ఆడదైనా కోరుకునేది పిల్లల శ్రేయస్సే. అది నూటికి నూరుపాళ్ళు నిజం. శంకరాచార్యులవారు దేవి అపరాధ స్తోత్రంలో ఇలా చెప్పారు. 'కుపుత్రో జాయేత క్వచిదపి కుమాతానా భవతి' దుర్మార్గులైన బిడ్డలు వుండచ్చు లోకంలో. కానీ దుర్మార్గురాలైన తల్లి మాత్రం ఏ లోకంలోనూ, ఎప్పుడూ వుండదు.

స్త్రీ అబలా? సబలా? ఆ ప్రశ్నకి సమాధానం చెప్పేది ఎవరూ.. ప్రతీ స్త్రీ వాదనకంటే ముందు తన పరిస్థితిని తానే సమీక్షించుకోవాలి. ఈ ప్రశ్న ఆ వ్యక్తికి మాత్రమే సంబంధించింది.

మన గ్రామాలు మళ్ళీ మనుషులతోనూ, జీవకళతోనూ, కళకళలాడాలంటే మరో కొత్తబాట వేసి తీరాలంటారు రచయిత్రి. ప్రతి రైతూ ఒకప్పుడు మేలైన విత్తనాలను తానే తయారుచేసుకునేవాడు అనే నిజాన్ని **'కొత్త బాట'** అనే కథలో ప్రస్తావించారు అనివేణిగారు.

ఉత్తరం రాసే చివరితరం మనదేనేమో అని గుండె నిండుగా వాపోయారు రచయిత్రి **'ఉత్తరం'** కథలో, నిజం చెప్పాలంటే అది ముమ్మాటికీ నిజం.

చావు అన్నది మనిషికే కానీ మంచితనానికి కాదు. మనిషి పోయినా మంచి మిగిలే వుంటుందన్న సత్యాన్ని **'రాజీవ్ కాలనీ'** అనే కథలో చెబుతారు కస్తూరి. **'బడుగునీడ'**లో బతుకులు ఎదగవు అని సోదాహరణంగా చూపిస్తారు రచయిత్రి. గాంధీ మళ్ళీ వస్తే ఏమవుతుంది? ఆయన ఏమవుతాడు? హాస్యంగా చెబుతారు అలివేణి.

ఉత్తరాల రచయిత్రి నవలా రచయిత్రిగా మారిన వైనమే సుందరం జీవితంలో రెండో అంకం. నమ్మినా నమ్మకపోయినా **'చిలకజోస్యం'** ఫలిస్తుందండోయ్ అపుడప్పుడైనా. బిడ్డల కడుపులో వున్నప్పుడు తల్లిని తంతారు. అప్పుడు ముద్దు మురిపమే. ఆ చోద్యం పెద్దయ్యాక మానవత మరచి ప్రవర్తిస్తే ఎలా వుంటుందో 'కొత్త జీవితం' చదవండి.

సన్యాసి సంసారి అయితే అది కూడా తల్లి మౌనవ్రతంలో, పార్వతమ్మలా ఓ స్త్రీ కోపంతో లైఫ్‌లాంగ్ మౌనవ్రతం పాటిస్తానని భీష్మ ప్రతిజ్ఞ చేస్తే మగవాళ్ళ ఊమే వేరు కదా? **'సన్యాసి పెళ్ళి'** చదివి ఆనందించండి.

వేదం ఎప్పుడూ అపౌరుషేయమే. ఊరికీ ఇంటికీ దేశ దేశాలకీ కూడా హితం కోరుకునేవాడే పురోహితుడని రుజువు చేసే కథ 'వేదం'. అంతులేని స్వేచ్ఛ అధఃపాతాళానికి ఎలా చేరుస్తుందో చెప్పే కథ 'నేటినిజం'.

ఇప్పటికీ వృద్ధాశ్రమాలు వృద్ధులకు గతి అవుతున్నాయి. కొందరు బయటపడవచ్చు. మరి కొందరు..? ఇది కుటుంబ వ్యవస్థ ఎదుర్కుంటున్న సమస్య. **'మూడు గదుల ఇల్లు'**లో ఈ సమస్యను చర్చించారు. పెద్దావిడ తీసుకున్న పరిష్కారమే సరైనదని మనకి అనిపిస్తుంది.

ఈ కథలన్నీ మధ్యలో ఆపకుండానే చదివాను. వేగంగా చదివించే టెక్నిక్ కస్తూరి అలివేని గారికి చక్కగా అబ్బిందని ఏ కథ చదివినా ఇట్టే చెప్పచ్చు.

మా అమ్మగారు రెండు మాటలు చెప్పేవారు. మొదటిది నేను సినిమాల్లోకి వచ్చే సందర్భంలో అడిగా. 'అమ్మా నేను ఇక్కడే వుండి ఉద్యోగం చూసుకోనా? లేక సినిమాల్లోకి వెళ్ళనా?" అని.


దానికి అమ్మ "నాయనా! చిగురుటాకులు ఆకాశంవైపు చూస్తే, ఎండుటాకులు ఎప్పుడు రాలిపోతామా అని నేలవంక చూస్తాయి. నేను పండుటాయకుని. నువ్వు ఆనందంగా వెళ్ళు. దిగ్విజయంగా ఎదుగు." అని అన్నారు. ఆ ఆశీర్వాదమే నాకు శ్రీరామరక్ష అయ్యింది.

ఇక రెండో మాట "అమ్మా! సినిమాల్లో బాగానే అవకాశాలు వచ్చి నిలదొక్కుకున్నాను. నువ్వు నాతో మద్రాసుకి రా' అన్నాను. అమ్మ నవ్వి 'ఏనాడైనా రెక్కలు వచ్చిన పక్షులు తల్లి గూటిలో వున్నాయా? అసలు వుంటాయా? అలాగే ఏ తల్లిపక్షి అయినా వృద్ధాప్యంలో పిల్లల గూటికి వెళ్ళి నన్ను చూసుకో అంటుందా? పిచ్చివాడా? పక్షులకు తెలిసినంత కూడా మనిషికి తెలియకపోతే ఎలా?" అంది నా తల నిమిరి.

అయ్యా!/ అమ్మా! ఈ కథలన్నీ జీవితాలకి అతి దగ్గరగా వున్నాయి. మనం మరచిన విషయాలని ఇందులో చదివి గుర్తుకు తెచ్చుకోవచ్చు. ఎందుకంటే జీవితం శాశ్వతం కాదు కదా? వీలయినంత ఎక్కువ ప్రేమిద్దాం! వీలున్నంతలో తక్కువ కోపిద్దాం' మానవులం కదా మరి!

చదవండి...! చదివించండి..! తెలుగు జాతిని, తెలుగు భాషని బతికించండి..!

శ్రీమతి కస్తూరి అలివేణికి అభినందనలతో, ఆశీస్సులతో..



**-భువనచంద్ర**
(సినీ గేయ రచయిత)

## నానీలు

కవిత అంటే
కలత రేపేది కాదు
ధైర్యానికి
చిగురు తొడిగేది!

కడుపులో వున్నప్పుడు తంతే
బాధ లేదు
బయట వుంది తంతేనే
నరకం!

ప్రేమికులు
ఎండలో మాట్లాడుకుంటున్నారు
ఎండ
వారి జోలికి వెళ్లదు.

ఆ పోస్టర్ని
అదే పనిగా చూస్తున్నాడు
ఆఖరి బస్సు పోయి
అరగంటైంది.

నీ యింట్లో
లైటారిపోయింది సరే
ఎదురింట్లోకి
తొంగి చూస్తారెందుకు?

కొడుకు
బంగారంలా తిరుగుతున్నాడు
జాల ఏమిటి?
నిరుద్యోగం.

బడాయి చాలు
తేడా ఏముంది మనకు?
నువ్వు స్టేట్స్‌లో వుంటే
నేను స్టేట్‌లో..

పల్లెలు
పట్నాలుగా మారుతున్నాయి
మరి
పట్నాలు ఏమౌతున్నాయి!

కోతి నుంచి
మనిషి వచ్చాడా?
పాపం
కోతికెంత అవమానం!



– మసన చెన్నప్ప
సెల్:9885654381

# ఆత్మ...ఆత్మానందం

ప్రతి మానవుడు తన జీవితంలో ఒక్కసారైనా ఆత్మ అనే పదాన్ని తప్పక ఉపయోగిస్తాడు, ఉచ్చరిస్తాడు. సాధారణ పరిభాషలో ఆత్మ అంటే మనిషి లోపల ఉండే మనసు, బుద్ధి, చిత్తం అని చెప్పవచ్చు. ప్రతి మతంలోనూ ఆత్మ గురించి ప్రస్తావన ఉంటుంది. అయితే హిందూ మతంలో ఆత్మ అనే తాత్విక భావన చాలా ప్రాముఖ్యత సంతరించుకున్నది. ఆత్మ అనేది, ఒక వ్యక్తి యొక్క ఆధ్యాత్మిక సారాంశం. సామాన్య మానవుని భావనలో ఆత్మ అంటే మనసు, గుండె.

మనలో చాలామందికి ఆత్మ గురించి, దాని స్వభావం గురించి అర్థం తెలుసుకోవడం చాలా కష్టంగానూ సంక్లిష్టంగా ఉంటుంది. అది నారికేళ పాకం వంటిది. జగంలో చాలామంది ఆత్మ ఉందంటారు. మరి కొందరు ఆ ఆత్మే లేదంటారు. అది భౌతిక వాదుల, అభౌతిక వాదుల (ఆస్తికుల నాస్తికుల) సంవాదం పై ఆధారపడి ఉంటుంది. కానీ ఆత్మ అనే భావన తెలుసుకుంటే ఎంతో మానసిక వికాసం, మనోధైర్యం, మనిషికి జీవితం పై రక్తి, భక్తి , ముక్తి కలుగుతుంది అనడంలో ఎలాంటి సందేహము లేదు.

స్థూలంగా చెప్పాలంటే శరీరాలు రెండు రకాలు 1. స్థూల శరీరం అంటే మనం చూస్తున్న, మోస్తున్న శరీరం 2.సూక్ష్మ శరీరం అది మన లోపల అంతర్లీనంగా ఉండేది. అంటే స్థూల శరీరం నశిస్తుంది. సూక్ష్మ శరీరం నశించదు. ఆ నశించని సూక్ష్మ శరీరంలో ఉండే నాశనరహితమైన జీవుడే ఆత్మ అని చెబుతుంటారు.

ఆత్మ అనేది స్వయం అస్తిత్వ సారాన్ని సూచిస్తుంది .అనగా ఆత్మను మనుషులలో ఉండే భగవత్ స్వరూపం లేదా భగవంతుని అంశం అని చెప్పవచ్చు. ఆత్మ రెండు రకాలు 1.జీవాత్మ (అన్ని జీవులలో ఉండేది ) 2.పరమాత్మ (ప్రకృతిలో, విశ్వములో నిండి ఉండేది)

ఆత్మ అనేది సంస్కృత పదం. దీనికి సారం, శ్వాస ,వ్యక్తుల స్వీయతత్వం అని అర్థం. అయితే భాషాపరంగా ఆత్మకు అనేక నానార్థాలు గలవు, అవి జీవుడు, బుద్ధి, బ్రహ్మము, మనసు, శరీరం, స్వభావము, గుండె , హృదయం, అంతరంగం, ప్రయత్నం, ధైర్యం మొదలైనవి. అదే అచ్చ తెలుగులో ఆత్మకు ఇచ్చ, ఎడద, ఎద, ఎదపట్టు, గుట్టుపట్టు, తాను , లోతాను, లోపట్టులో ఉనికిపట్టు, ఎదరి అని చెప్పవచ్చు.

> నిజానికి ఆత్మ అనేది అణువు కన్నా సూక్ష్మమైనది. కాబట్టి అది తర్కానికి , వాదోపవాదాలకు అతీతమైనది

ఆత్మ అంటే వ్యక్తి యొక్క నిజమైన స్వయం లేదా స్వీయ ప్రకాశించే స్పృహ, అంతర్గత సారాంశంగా భావించవచ్చు .అయితే హిందూ మతం ప్రకారం ఆత్మ అంటే, శరీరం లేదా మనసు లేదా స్పృహతో సమానం కాదు ,కానీ ఆత్మ వీటన్నింటికీ మించిన అంతర్గతమైన దేవుని అంశం, స్వచ్ఛమైన దైవిక సారాంశం, మార్పులేని, శాశ్వతమైన, అంతర్లీనమైనప్రకాశం. అది వ్యక్తిత్వం ద్వారా ప్రభావితం కాదు. అహంతో ప్రభావితం కాదు. అది చలిస్తుంది, చలించదు. అది ప్రకాశిస్తుంది. ప్రకాశించదు. ఆత్మ నాశనం కానిది. శస్త్రం చేదించలేనిది. అగ్ని దహించలేనిది. నీరు తడపలేనిది. వాయువు ఆర్ప లేనిది. అది నీలో ఉన్న భగవంతుని అంశం. దానికి చావు పుట్టుకలు లేవు. ఆత్మ దేని నుండి ఉత్పన్నం కాదు. కాలేదు. ఆత్మనుండి ఏది పుట్టదు. జన్మరహితమై ఎప్పటికీ శాశ్వతమైనది. ఆత్మనే అంతరాత్మ అని కూడా అనవచ్చు. దీనికి కుల మత వర్గ రూప భేదాలు ఉండవు. ఇది ఒక దివ్య శక్తి. శరీరం నశించినా ఆత్మ అలానే ఉంటుంది.

భారతీయ తత్వశాస్త్రంలో ఆత్మ అనేది ఒక కేంద్ర భావన. ఇది ఆత్మ వ్యక్తిగతంగా నేనే (జీవాత్మ) సర్వోన్నతంగా నేనే (పరమాత్మ). ద్వైత అద్వైత సిద్ధాంతాలకు పునాది ఈ ఆత్మ భావనే. శంకరుని అద్వైతం ప్రకారం, ఆత్మ పరమాత్మ ఒకటే. మధ్వాచార్యుల ద్వైతం ప్రకారం ఆత్మ వేరు, పరమాత్మ వేరు. ఈ శరీరం పుట్టినప్పుడు, ఈ శరీరం పెరిగేటప్పుడు, ఈ శరీరం చనిపోయేటప్పుడు ఏదైతే మార్పు లేకుండా ఒకటిగా శరీరంలో ఉన్నదో అదే ఆత్మ. ఆత్మే నువ్వు.

మరో విధంగా చెప్పాలంటే, ఏదో ఒక నాటికి తప్పక మరణించే, ఈ శరీరం నువ్వు కాదని తెలుసుకొని, ఈ శరీరం శాశ్వతం కాదని, నీ అనుభవములోనికి తెచ్చుకొని, ఈ మాయాలోక భ్రమల నుండి నువ్వు నువ్వుగా బయటకు వచ్చి, ఈ శరీరం నేను అనే భ్రమను తొలగించుకొని, ఆత్మను నేను, అనే భావన కలిగి, ఆత్మ గురించి తెలుసుకోవడమే ఆత్మజ్ఞానం. ఈ ఆత్మ జ్ఞానం పొందిన వ్యక్తికి చిత్, సత్,పరమానందం కలుగుతుంది. ఇక అతనికి, అతని మనసుకు ఎలాంటి ద్వంద భావనలు ఉండవు. అంటే సుఖదుఃఖాలు, బంధాలు అనుబంధాలు, ప్రేమలు, ద్వేషాలు ఏ విషయాలు పట్టవు. ఆలోచనలు రావు. మొదట భిన్నత్వంలో ఏకత్వం, తరువాత ఏకత్వంలో భిన్నత్వం ఆస్వాదిస్తాడు .ఒకసారి అజ్ఞానాన్ని తొలగించుకొని, ఆత్మస్థితి లోనికి ప్రవేశించిన వారు ఆత్మసాక్షాత్కారం పొందుతారు.

మరో విధంగా చెప్పాలంటే, ఆత్మంటే శుద్ధ చైతన్యం .అది అన్ని జీవులలో అంతర్గతంగా ఉండేది. జనన మరణాలకు లోబడి శరీరంలో ఉన్నప్పుడు దానిని జీవాత్మ అంటారు. పరమాత్మ శాశ్వతమై ప్రతి జీవాత్మ హృదయములో సాక్షిగా మరియు బయట విశ్వాన్ని నియంత్రిస్తూ ఉండే అత్యున్నత శక్తి .అదే పరమాత్మ .

నిజానికి ఆత్మ అనేది అణువు కన్నా సూక్ష్మమైనది .కాబట్టి అది తర్కానికి ,వాదోపవాదాలకు అతీతమైనది ,కావున ఆత్మజ్ఞానాన్ని,దాని అనుభూతి సిద్ధించాలంటే, దానికి సద్గురు కటాక్షం కావాలి. అతని ద్వారా , ఉపదేశ రూపంలో ప్రసాదించినప్పుడే, ఆత్మవిద్య అవగతం అవుతుంది .అది అభౌతికమైనది. కనుక సద్గురు మార్గదర్శనం ద్వారా ,ఆధ్యాత్మిక సాధన మార్గం ద్వారా ,ధ్యానించి సుఖదుఃఖాలకు అతీతమైన ఆత్మానుభవ స్థితిని పొందవలెను .

భౌతిక శరీరం వేరు. శరీర హృదయమనే గుహలో జ్యోతి లాగా వెలిగే ఆత్మ వేరు, ఆత్మకు సాధనంగా పనిచేసే పరికరమే భౌతిక శరీరం. అంతేగాని శరీరమే ఆత్మ కాదు. ఈ సత్యాన్ని సద్గురువు ఉపదేశం ద్వారా విని, అర్థం చేసుకోవాలి. అలా సత్య స్వరూపాన్ని బాగా వివేచన చేసి తెలుసుకోవాలి. శరీరం నుండి విడదీసి ఆత్మను తెలుసుకోవాలి. ధర్మాధర్మాలు, కార్య కారణాలు, భూత భవిష్యత్తు కాలస్వరూపాలు మొదలగు అన్నిటికన్నా అతీతమైనది ఆత్మ తత్వం అని గ్రహించాలి.

ఆత్మ అన్ని జీవుల శరీరాలలో ఉంటుంది . నశించిపోయే వస్తువులన్నింటిలోనూ ఉంటుంది. ఆత్మ సర్వత్రా నుండి ఉన్నది. సత్యమార్గం లో బుద్ధి వికాసం కలిగి ఉన్నవారు, ఈ ఆత్మతత్వం తెలుసుకొని బంధ విముక్తుల వుతారు.

> జీవుడు అనేకమైన కర్మలు చేస్తాడు. అందులో కొన్ని మంచి కర్మలు కావచ్చు.

వేద వేదాంగాలు ,అనేక శాస్త్రాలు, పెక్కు పురాణాలు చదివిన పండితులైన, మేధావులైన, వాళ్లు వారి ప్రతిభ కారణంగా ఆత్మజ్ఞా నాన్ని పొందలేరు. ఎట్టి పాండిత్యం ఏమీ లేకున్నా, ఎవడు ఆత్మతత్వం కోసం తపిస్తాడో, సద్గురు బోధనలచే అంతర్ముఖుడై, ఆత్మ శోధన చేస్తారో వారు మాత్రమే ఆత్మజ్ఞానాన్ని పొందుతారు.

చెడు పనులు చేసేవారు, దుష్ట ప్రవర్తన గలిగే వారు, ఇంద్రియాల మీద అదుపు లేని వారు, కోర్కెలను అదుపు చేసుకోలేని వారు, మనసు ప్రశాంతత లేని వారు, అహాన్ని, ఈర్ష్య చంపుకోలేనివారు, ఆత్మసాక్షాత్కారాన్ని పొందలేరు.

ఆత్మసాక్షి అంటే మనస్సాక్షి అని అర్థం కాదు. శరీరం కంటే భిన్నమై శాశ్వతమైన నేననే భావన. అదే ఆత్మ అని తెలుసుకున్నప్పుడు, ఆత్మ జ్ఞానము అనగా మోక్షము పొందే మార్గము, పరమాత్మను తెలుసుకొనే తెలివిని పొందుతారు .దానినే ఆత్మజ్ఞానం అని అంటారు.

జీవించి ఉన్నంత కాలము నాది, నా వాళ్లు, అనే స్వార్థ చింతనతో అరిషడ్ వర్గాలకు బానిసలై, గర్వాతిశయంతో మిడిచిపడేవారు, ఆస్తులు అంతస్తులు, భూములు భవనాలు, సంపదలు, కీర్తి, అధికారం, కామ వాంఛల వెంట పడి జీవితం సాగిస్తున్నవారు. విద్యావంతులమని, పండితులమని, శాస్త్ర వాదోపవాదాలతో బ్రతుకుతూ, పేరు ప్రఖ్యాతల కోసం వెంపర్లాడేవారు.

ఈ శరీరం ఈ సంపదలు, బాంధవ్యాలు, శాశ్వతాలని భావిస్తూ, ఇవి అశాశ్వితాలని తెలుసుకోలేనివారు, వారి హృదయములో ఉన్న ఆత్మ గురించి ఎప్పటికీ తెలుసుకోలేరు. వారు జనన మరణ చక్రంలో పడి, మరలా మరలా పుడుతూ గిడుతూ కొట్టుకుపోతుంటారు. అలాంటి వాళ్లకు ఆత్మజ్ఞానం అనేది చాలా కష్టం. ఈ ఆత్మ శాశ్వతమని, దానిని ధ్యానించినప్పుడే, శాశ్వతత్వాన్ని, ముక్తిని పొందుతామని తెలుసుకోలేరు. మృత్యువు నుండి తప్పించుకోలేరు. ఈ విషయాలను ఉపనిషత్తులలో తెలియజేశారు.

హృదయమనే గుహలో వెలిగే ఆత్మజ్యోతిని చూడటం అందరికీ సాధ్యం కాదని, ఓంకార మంత్ర జపంతో అంతర్ముఖులై , ధ్యానముఖులై, ఆత్మ తత్వాన్ని తెలుసుకోవడానికి సద్గురువు ఉపదేశంతో సాధన చేసే వారికి, ఈ ఆత్మజ్ఞానం కలుగుతుంది అని ఉపనిషత్తులు వెల్లడించాయి.

ఆత్మ జ్ఞానాన్ని పొందడానికి మౌనం అనేది మరొక పద్ధతి. మౌనం కూడా బ్రహ్మచర్యంతో సమానమే. మౌనం అనే సాధనాన్ని ఆలంబనగా చేసుకొని, సాధకుడు ఆత్మజ్ఞానం పొందుతాడు. ధ్యాన మార్గం గుండా ఆత్మానుభూతిని పొందుతాడు. మౌనం అంటే మాట్లాడకుండా ఉండడం. మాట్లాడకుండా మౌనం పాటించడం అంటే, మామూలు సంజ్ఞలతో మాట్లాడకుండా, భావాలను తెలియజేయడం కాదు.

మనసులోనికి ఎలాంటి ఆలోచనలు ప్రవేశించకుండా తురీయ స్థితిలోకి మనసు కరిగిపోయి, కేవలం పరమాత్మ ధ్యానములోనే లీనమైపోవడమే అసలైన మౌనం. ఇదే ఆత్మ సాక్షాత్కార్యాన్ని కలిగించే మార్గం.

బుద్ధుడు ఆత్మ పరమాత్మను నిరాకరించాడు. వేద ప్రామాణ్యాన్ని ఖండించాడు. వర్ణ వ్యవస్థను త్రోసిపుచ్చాడు. అయితే జైన మతం జైన సాకార ఆత్మ భావనే గాక, అనేకాత్మవాదాన్ని తెలియజేసింది. మనుషులకే గాక, జంతువులకు, చివరకు రాళ్ళు రప్పలకు కూడా ఆత్మ ఉంటుందనిజైన మతం విశ్వసిస్తుంది.

లోకాయతులు, చార్వాకులు మొదలగు నాస్తికులు ఆత్మను విశ్వసించరు. వారు ఉన్నదొకటే శరీరము, మరణించిన తర్వాత అది పూర్తిగా కాలి శరీరము మొత్తము బూడిద అయిపోతుంది. గాలిలో మట్టిలో కలిసిపోతుంది. అంతేగాని అక్కడ ఆత్మ అంటూ ఏదీ ఉండదని వారి భావన.

ఆత్మను అనేక విధాలుగా శంకరాచార్యులు వర్ణించారు. వారు ఆత్మ గురించి, ఆత్మ స్వరూపాన్ని గురించి ఈ విధంగా తెలియజేశారు.

ఉపనిషత్తులు ఆత్మను అనేక విధాలుగా వర్ణించాయి. వ్యవహారిక అనుభవంలో అంతర్గతంగా ఉన్న సత్యాన్ని అన్వేషించి తెలియచెప్పేదే ఆధ్యాత్మిక విద్య. కంటికి కనిపించే ఈ సమస్తమైన భౌతిక ప్రపంచానికి ఆధార భూతమైనది ఏమిటి ?ఈ ప్రశ్నను అన్ని దర్శనాలు చర్చించాయి. కానీ శంకరుడు చెప్పిన సమాధానం మాత్రం విశేషంగా గోచరిస్తుంది. మన ఇంద్రియాలు మనలను మోసం చేయవచ్చు, మన స్మృతి జ్ఞానంలో లోపం ఉండవచ్చు .

భవిష్యత్తు విషయాలు మన ఊహాగానాలు కావచ్చు. కానీ వీటన్నింటినీ మించి ఏదో ఒక అంతర్గతమైన శక్తి ఉన్నట్లు మనకు తోస్తుంది. ఆ శక్తియే, ఆత్మ, పరమాత్మ. ఆత్మ ఉనికిని ప్రత్యేకించి రుజువు చేయనక్కరలేదు.

ఆత్మ స్వయం ప్రకాశం కలది. బుద్ధికి ,మనసుకు ఇంద్రియాలకు, ఆత్మ ఒక సంధాతగా ఉంటుంది. వాటి ద్వారా ఆత్మను తెలుసుకోలేము . తర్కం ద్వారా ఆత్మను గురించి తెలుసుకోలేము. అయితే మనకు లభించే జ్ఞానం ఆత్మ స్వరూపమే..అంటే జ్ఞానం, ఆత్మ రెండు భిన్నం కావు .. ఆ రెండు ఒకటే. జ్ఞాన స్వరూపమే ఆత్మయే జ్ఞాన స్వరూపం. ఆత్మతో సంబంధంలేని జ్ఞానం కానీ, అనుభవం కానీ ఉండవు. ఆత్మభావానికి ఆత్మయే విషయమవుతుంది. ఆత్మ స్వయంగా విదితమ వుతుంది. ఆత్మను గురించి ఏ ప్రమాణం ద్వారానూ తెలుసుకోలేము. అన్ని ప్రమాణాలకు ఆత్మయే ఆధారం. అన్ని ప్రమాణాలు వాటి సుసం గత్వానికి ఆత్మను ఆశ్రయించి ఉంటాయి. ఆత్మ ఒక సాధ్య వస్తువు కాదు. అది సిద్ధ వస్తువు .అది ఎప్పుడూ ఉన్నది. దాని గురించి తెలుసుకోవడమే ఆధ్యాత్మిక విద్య అవుతుంది.

శంకరుని దృష్టిలో అహం ప్రత్యయ విషయరూపమైన కర్తకు, ఆత్మ భిన్నంగా ఉంటుంది. అది సర్వసాక్షి. అది ఏకంగానూ ,అద్వితీయంగానూ ,అన్నింటిలోనూ సమానంగా ఉంటుంది .ఆత్మ లేదని ఎవరైతే చెబుతారో వారి స్వరూపమే ఆత్మ. అందువల్ల దానిని ఎవరు లేదని చెప్పలేరు. కనుక ఎవరైనా మరణిస్తే శరీరం నశించిందని భావించాలి కానీ. ఆత్మ నశించిందని చెప్పడానికి వీలు లేదు. జనన మరణాలు ఆత్మ ఉపాధులు. అవి ఆత్మ స్వరూపాలు కావు.

జ్ఞానం ఆత్మకు ఆగంతుక ధర్మమని కొందరన్నారు. అంటే ఆత్మలో జ్ఞానం వస్తూ పోతూ ఉంటుంది. కానీ శుద్ధ జ్ఞానమే ఆత్మ స్వరూపమని శంకరులు చెప్పారు. నిద్ర మొదలైన అవస్థలలో కూడా ఆత్మ, జ్ఞాన స్వరూపమే .మాయా మోహితమైన ఈ ప్రపంచంలో ఆత్మ ఉన్నంతకాలం దాన్ని జీవుడని పిలుస్తారు. బుద్ధికి వర్తించే లక్షణాలన్నీ జీవునికి వర్తిస్తాయి. అహంకార మమకారాలు ,రాగద్వేషాలు, సుఖదుఃఖాలు, మొదలైన గుణాలన్నీ జీవి సంసారంలో ఉన్నంతకాలం ఉంటాయి. అయితే అవి ఆత్మకు ఎంత మాత్రం వర్తించవు. ఆత్మ తన స్వరూపాన్ని గుర్తించినప్పుడు, జీవి ప్రపంచం ....అంతా దానికి మిథ్యగా గోచరిస్తాయి. కానీ అంతవరకు అన్ని యధార్థమే.

ఆత్మ స్వయం ప్రకాశమని, స్వయం సిద్ధమని, శుద్ధ జ్ఞాన స్వరూపమని, చావుపుట్టుకలు దానికి లేవని చెప్పాము. జీవుడు అనేకమైన కర్మలు చేస్తాడు. అందులో కొన్ని మంచి కర్మలు కావచ్చు. కొన్ని చెడు కర్మలు కావచ్చు. అవిద్యా ప్రభావం వలన కర్తృత్వం.. భోక్తృత్రుత్వం ఆపాదించబడ్డాయే కానీ, యదార్థ దృష్టితో చూస్తే, ఆత్మకు కర్త భోక్త అనేవి అంటవు. నిత్యం మనకు కనిపించే కొన్ని సాధారణ అంశాల సహాయంతో ఈ విషయాన్ని శంకరుడు వివరించారు. ఉదాహరణకు ఒక వడ్రంగి ఉన్నాడనుకుందాం. ఆయన శ్రమించేటప్పుడు ఉలి, కత్తి , రంపం, బాడిస మొదలైన పనిముట్లతో తన పనిని నిర్వహిస్తాడు. కానీ పని అయిపోయిన వెంటనే ,వాటిని ప్రక్కన పెడతాడు. అంటే అతని విశ్రాంతి సమయంలో ఆ పనిముట్లకు, ఆయనకు ఏమీ సంబంధం లేదు. అదే విధంగా ఆత్మ, శరీరం, బుద్ధి, అంతకరణం, మనసు ఇంద్రియాలు అనే పనిముట్లతో జాగ్రదావస్థలో పనిచేస్తుంది. దాని అసలు స్వరూపంలో వీటికి ఆత్మకు ఏ విధమైన సంబంధం ఉండదు.

**ఆత్మ గురించి వేదాలలో ఉన్న కొన్ని వాక్యాలను చూద్దాం**

1. ప్రజ్ఞానం బ్రహ్మ.... చైతన్య స్వరూపమే నేను .సత్య స్వరూపమే బ్రహ్మ.
2. అహం బ్రహ్మోస్మి.... నేనే బ్రహ్మను

> ఉపనిషత్తులు ఆత్మను అనేక విధాలుగా వర్ణించాయి. వ్యవహారిక అనుభవంలో అంతర్గతంగా ఉన్న సత్యాన్ని అన్వేషించి తెలియచెప్పేదే ఆధ్యాత్మిక విద్య.

3. తత్వమసి... అది నేనే ,పరమాణు రూపంలో ఉన్న జీవం నేనే.
4. అయం ఆత్మా బ్రహ్మ... బ్రహ్మ స్వరూపమే ఆత్మ స్వరూపం.. నిర్గుణ నిరంజన నిరాకార స్వయంప్రకాశ ఆత్మే బ్రహ్మ.

ఆత్మజ్ఞానం పొందిన సత్పురుషుని మానసిక స్థితి ఎలా ఉంటుందో ఒకసారి చూద్దాం.

ఆత్మజ్ఞానం పొందినప్పుడు దశలవారీగా మానవునికి అనుభవం వస్తుంది.

నీది ..నేను ..నీవు ..అనేస్వపర బేధభావంతో నిండి ఉన్న మనసు ఆత్మయే సర్వస్వం అనే భావనను అనుభవంలోనికి తెచ్చుకుంటాడు సాధకుడు. ఈ దశలో సాధకుడు స్వపర బేధాలను విస్మరిస్తాడు. నానాత్మకంగానూ, భిన్నత్వంగాను, అనేకాత్మకంగానూ గోచరించే ఈ సమస్తమైన వస్తు ప్రపంచాన్ని ,భావ ప్రపంచంలో ఏకత్వమైన రూపంలో చూడడానికై సాధకుడు ప్రయత్నిస్తాడు.

ఎప్పుడైతే అతని మనోఫలకం మీద నానాత్వ స్వరూపం సమసిపోయి , ఏకత్వ స్వరూపం ప్రతిబింబిస్తుందో అప్పుడు ఆయనకు స్వపర బేధాలు గోచరించవు.

ఏకతను ,ఐక్యతను ,సమతను మాత్రమే చూస్తాడు. ఈ ఐక్యత, సమతా దృక్పథంలో నుంచి ఏకత ను మాత్రమే చూస్తాడు .దాన్ని కూడా అధికమించిపోయి చూస్తే చూడడానికి, వినడానికి ,తాకడానికి కదలడానికి, చేయడానికి అంటూ ఏమీ లేని స్థితికి మానసికంగా సాధకుడు ఎదుగుతాడు.

**'ఆ దశలను ఇప్పుడు చూద్దాం'**

సాధకుని మొదటి దశ.
(అనేకత్వం, నానాత్వం , పశ్యతిః)
అనేకత్వాన్ని భిన్నత్వాన్ని నానాత్వాన్ని సాధకుడు చూస్తాడు
రెండవ దశ.
(నానాత్వం నపస్యతి)
నానాత్వాన్ని భిన్నత్వాన్ని చూడడు
మూడో దశ
(సమతాం పశ్యతి)
సమానత్వాన్ని సాధకుడు చూస్తాడు
నాలుగో దశ
(సమం పశ్యతి,)
అన్ని సమానమనే దృష్టి ఏర్పడి స్థిరంగా ఉంటుంది

> ఆత్మ స్వయం ప్రకాశం కలది. బుద్ధికి ,మనసుకు ఇంద్రియాలకు, ఆత్మ ఒక సంధాతగా ఉంటుంది. వాటి ద్వారా ఆత్మను తెలుసుకోలేము . తర్కం ద్వారా ఆత్మను గురించి తెలుసుకోలేము. అయితే మనకు లభించే జ్ఞానం ఆత్మ స్వరూపమే..అంటే జ్ఞానం, ఆత్మ రెండు భిన్నం కావు .. ఆ రెండు ఒకటే. జ్ఞాన స్వరూపమే ఆత్మయే జ్ఞాన స్వరూపం.

ఐదో దశ
(ఏకం పశ్యతి)
ఒక్కటే చూస్తాడు (బ్రహ్మ దర్శనం అవుతుంది)
ఆరోదశ
(నపశ్యతి,)
చూడడానికంటూ ఆయనకు ఏమీ ఉండవు (చుట్టూరా అన్ని ఉంటాయి)

## 'ఆత్మ గురించి కొన్ని విషయాలు'

ఆత్మ గురించి తెలియజేసేదే ఆధ్యాత్మికత
ఆత్మ నిరాకారం, నిరంజనం, నిర్గుణం
ఆత్మ స్థూల జగత్తుకు, విశ్వమంతటికి ఆధారం
ఆత్మ ఉన్నది అనడానికి ఎటువంటి ఆధారం లేదు
ఆత్మ లేదు అని వ్యతిరేకించలేం.....త్రోచిపుచ్చలేం
ఆత్మ సర్వత్రా, అంతటా , అన్నిటా వ్యాపించి ఉంటుంది
ఆత్మకు ఎటువంటి ఆధారం ఉండదు
ఆత్మను గురించి తెలుసుకోవడమే జీవిత పరమార్థం
ఆత్మ అనేది సృష్టికర్త ....సృష్టి అంతటికి మూలం
ఆత్మ అనేది అనాత్మ అంతటా వ్యాపించి ఉంటుంది
ఆత్మ గురించి అవగాహన లేకపోతే జీవితం వ్యర్థం
ఆత్మను స్రుజించలేం, దహించలేం, విభజించలేం
ఆత్మ విశ్వంలో అత్యంత ఎక్కువగా వ్యాపించి ఉంటుంది
ఆత్మ అనేది అత్యంత సూక్ష్మాతి సూక్ష్మమై ఉంటుంది
ఆత్మ అంటే భగవంతుడు శుద్ధ చైతన్యం లేక పరబ్రహ్మం
ఆత్మ అనంతం, సర్వస్వం మరియు పరిపూర్ణం
ఆత్మకు సంబంధించిన దానిని ఆధ్యాత్మిక శాస్త్రం అంటారు
ఆత్మ నిశ్చలమైతే పరమాత్మ కూడా నిశ్చలమవుతుంది
ఆత్మకు అన్నీ తెలుసు, కానీ దాని గురించి ఎవరికీ ఏమీ తెలియదు
ఆత్మ అందరినీ చూస్తుంది.... దానిని ఎవ్వరూ చూడలేరు
ఆత్మ స్థితికి చేరితేనే ఆత్మానుభూతి కలుగుతుంది
ఆత్మ నుండి అనాత్మ ఆవిర్భవించి తిరిగి ఆత్మలోనికి కలిసిపోతుంది
ఆత్మ నుండి అనాత్మను వేరు చేయడం సాధ్యం కాదు
ఆత్మ లేనిదే విశ్వానికి ఎటువంటి ఉనికి ఉండదు
ఆత్మస్థితికి చేరితేనే అది అనుభవం లోనికి వస్తుంది
ఆత్మకు ఎటువంటి సమాచారం ఉండదు
ఆత్మ ఘనీభవనం చెందితే ప్రాణశక్తి ఏర్పడుతుంది
ఆత్మ అనేది ఒక జీవికే పరిమితమైతే అది "జీవాత్మ" అవుతుంది
ఆత్మ అనేది విశ్వమంతా వ్యాపించినట్లయితే అది" పరమాత్మ" అవుతుంది
ఆత్మను సాక్షాత్కారం గావించుకోవడం బహు కష్టతరం
ఆత్మను ఎక్కడ వెతకవలసిన అవసరం ఉండదు, అది నీలోనే ఉన్నది
ఆత్మ ఒకవైపు సంకల్పంగా మరొకవైపు పదార్థంగా మారుతుంది
ఆత్మకు ఆధారం లేకపోయినా అత్యంత శక్తివంతంగా ఉంటుంది
ఆత్మ అనేది అందరి అంతరంగంలోనే ఉంటుంది
ఆత్మ అనాత్మగా మారనంతవరకు స్వచ్ఛంగా ఉంటుంది
ఆత్మ లేనిది జీవకోటికి ఎటువంటి ఉనికి ఉండదు
ఆత్మను అనుభవంలోనికి పొందిన వారే "సిద్ధ పురుషులు"
ఆత్మను బహిర్గతం చేసినవారే "ఋషిపుంగవులు"
ఆత్మ దృష్టికి చేరిన వారే ఆత్మను అనుభవించగలుగుతారు
ఆత్మను కూడా దాటి వెళ్ళగలిగితేనే ఆత్మస్థితికి చేరుతాం
ఆత్మను అనుభవించడమే గాని నిరూపించడం సాధ్యం కాదు
ఆత్మను ఎరిగిన వారికి సర్వము అవగాహన అవుతుంది
ఆత్మను బహిర్గతం చేయగలిగింది మానవుడు మాత్రమే
ఆత్మ అంతరంగంలోనే ఉన్నది అని తెలుసుకోవడమే "అంతర్ముఖం"
ఆత్మ విద్యలో ఆరితేరితే జీవితం ఆనందమయం అవుతుంది
ఆత్మను "క్షేత్రజ్ఞుడు " అనుకుంటే అనాత్మ అంతా " క్షేత్రం" అవుతుంది
ఆత్మ అనాత్మలను కలిపి చూడగలగడమే పరిపూర్ణత్వం
ఆత్మ కోసం అన్వేషణ చేయడమే అజ్ఞానం ,అపరిపక్వత
ఆత్మలో అనాత్మ ఉండదు కానీ ఆత్మ అనాత్మలో ఉంటుంది
ఆత్మను అనాత్మ నుండి వేరు చేయడమే ద్వైత్వమవుతుంది
ఆత్మ దేహమంతట పైనుండి క్రిందికి వ్యాపించి ఉంటుంది
ఆత్మస్థితికి చేరిన వారే పరమానందాన్ని పొందగలుగుతారు
ఆత్మ మినహా విశ్వములో మరొకటి లేనేలేదు
ఆత్మ స్థితి నుండి విశ్వాన్ని దర్శిస్తే ఆత్మదర్శనమవుతుంది
ఆత్మ ఘనీభవనం చెంది భౌతిక జగత్తుగా రూపాంతరం చెందుతుంది
ఆత్మను అంతరంగంలోని గుర్తించగలిగితే సంస్కారం శుద్ధి జరుగుతుంది
ఆత్మ అంతటా ఉన్నందువలన ప్రత్యేకంగా వెతకడం అజ్ఞానమే
ఆత్మను అంతట గుర్తించిన ప్రతి వ్యక్తి పరిపూర్ణుడవుతాడు
ఆత్మను బయట వెతికే వారంతా పరధ్యానాన్ని పెంచుకుంటారు
ఆత్మయే విశ్వం అనుకుంటే ఇక సాధన ముగిసినట్లే
ఆత్మ అనేది భాషకు అందదు. వర్ణనకు సాధ్యం కాదు
... సర్వేజనా సుఖినోభవంతు..
ఓం శాంతి శాంతి శాంతిః



**-రాఘవ మాస్టారు కేదారి**
6362973252

